ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

7

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

శనివారం 7 డిసెంబరు 2024



రేపు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు



కొత్తచెరువు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతన (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలు ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లాలోని పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ, కదిరి డివిజన్ల పరిధిలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 8న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతాయన్నారు. మొత్తం 2,334 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు డీఈఓ తెలిపారు.

సందిగ్ధం



కొత్త రేషన్‌కార్డుల జారీపై స్పష్టత కరువు

సచివాలయాలకు వెళ్తున్న అర్హులు

దరఖాస్తులు స్వీకరించని వైనం

9

లాభాల నేరేడు



ఎనిమిదేళ్ల కష్టం... ఏడాదిగా ఫలితం

ఉద్దేహాళ్ నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

ప్రభుత్వం సహకరిస్తే మరిందరికి ఉపాధి

8

వ్యవసాయం కూడా పరిశ్రమే..



ప్రభుత్వం రాయితీలు ఇవ్వాల్సిందే

రైతు కోటిరెడ్డి

మూడెకరాల నుంచి 70 ఎకరాలకు

అన్నదాత విజయ ప్రస్థానం

8

వరికోతలు..!

"ఆరుగాలం కష్టపడి పండించిన పంటను నూర్పిడి చేసుకునేందుకు అన్నదాత అష్టకష్టాలు పడుతున్నాడు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వరి కోతలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పంటను కోద్దామంటే యంత్రాలు దొరకట్లేదు. ఒకవేళ దొరికినా పొలాల్లో తేమ ఎక్కువగా ఉండడంతో యంత్రాలు వెళ్లలేని పరిస్థితి. దీంతో వరి కోతలు రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. రైతులు రాత్రింబవళ్లు కష్టపడి వరిపంటను రక్షించుకున్నారు. ప్రస్తుతం కోత దశకు వచ్చాయి. వరికోత యంత్రాలు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వారంరోజులుగా వర్షాలు కురుస్తుండడం, ఆకాశం మేఘావృతమై ఉంటుండడంతో కోత కోయాలంటే రైతులు జంకుతున్నారు. మళ్లీ వర్షాలు ఉంటాయన్న వార్తల నేపథ్యంలో పంటను ఎక్కడ కోల్పోవాల్సి వస్తుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు."

- గాండ్లపెంట(ఆంధ్రజ్యోతి)



కోత ఆలస్యం కావడంతో నేలకొరిగిన వరి పంట

- వర్షంతో పంటకోతలు ఆలస్యం
- నేలరాలుతున్న వడ్లు
- కోత కోసేందుకు రైతుల కష్టాలు
- దొరకని యంత్రాలు
- భయపెడుతున్న తుఫాను



కోత యంత్రాల కోసం పడిగాపులు

జిల్లాలో వేల ఎకరాల్లో వరి సాగైంది. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పంటను కోయలేదు. దీంతో ఒకేసారి పెద్దఎత్తున వరి కోత కొచ్చింది. వెంటనే కోద్దామంటే వరికోత యంత్రాలు దొరకట్లేదు. వాటి కోసం వారాల తరబడి పడిగాపుల కాయాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో తిండిగింజలు ఇంటికి చేరుతాయా, లేదా అని రైతులు అనుమానంవ్యక్తంచేస్తున్నారు. గతంలో కూలీలు వరి కోతకు అధికంగా వచ్చేవారు. ప్రస్తుతం వరికోతకు కూలీలు రాకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోతున్నారు. తమిళనాడు నుంచి వరికోత యంత్రాలను కొంతమంది ఏజెంట్లు మండలానికి తెచ్చుకున్నారు. ఏజెంట్లకు అనుకూలంగా ఉన్నవారికే యంత్రాలు పంపుతున్నారని మిగతా రైతులు వాపోతున్నారు. ఇందులో రెండు రకాల యంత్రాలున్నాయి. నాలుగు చక్రాల యంత్రం గంటకు రూ.3,500, బెల్టు వరికోత యంత్రానికి గంటకు రూ.4వేలు అద్దె వసూలు చేస్తున్నారు. అయినా వరికోత కోస్తే చాలు అన్నట్లు రైతులు చెబుతున్నారు. అడిగినంత డబ్బు ఇస్తామన్నా యంత్రాలు దొరకడం లేదని వాపోతున్నారు.



వరి పంటను కోస్తున్న యంత్రం

తుఫానుతో తిప్పలు

తుఫానుకు ముందు వరికి నీరు పెట్టకుండా రైతులు ఆపేశారు. దీంతో భూమి వరి కోతకు అనుకూలంగా ఉండేది. తుఫాను ప్రభావంతో వారం రోజులపాటు వర్షం, చిరుజల్లులు కురవడంతో భూమి నాని, పొలాల్లో నీరు నిలిచింది. దీంతో వరికోతలు కోసేందుకు వీలుకాకుండా పోతోంది. పొలాల్లోకి కోత యంత్రాలు వెళ్లలేని దుస్థితి. సకాలంలో కోయకపోతే ధాన్యం నేలరాలిపోతుందని అన్నదాత ఆవేదన చెందుతున్నాడు.

భయపెడుతున్న మేఘాలు

ఇప్పటికే వరిపంటను కోసిన రైతులు ప్రస్తుతం ఆరబెట్టుకుంటున్నారు. మధ్యాహ్నం అయిందంటే మేఘాలు కమ్ముకుంటున్నాయి. దీంతో ఎక్కడ వర్షం కురుస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే ఈనెల 8, 9 తేదీల్లో మరోసారి వర్షాలు కురుస్తాయన్నవార్తలు వెలువడడంతో రైతుల్లో భయాందోళనలు మొదలయ్యాయి.



వడ్లను ఆరబోసిన దృశ్యం

పంట దక్కుతుందో.. లేదో..



వ్యయప్రయాసలకోర్చి వరి పంట పండించాం. ఎకరాకు రూ. పదివేలు పెట్టుబడి పెట్టాం. తీరా వరి కోతదశలో యంత్రాలు దొరక్క ఇబ్బందులు పడుతున్నాం. పంట కోయలేకపోతున్నాం. మరో తుఫాను వస్తుందన్న వార్తల నేపథ్యంలో పంట చేతికొస్తుందా, రాదా అన్న అయోమయంలో ఉన్నాం.

- ఇస్మాయిల్, యనుములవారిపల్లి

రైతు ద్రోహి.. జగన్

- డ్రిప్పు, స్ప్రింక్లర్లు ఇవ్వకుండా మోసం
- అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం: మంత్రి సవిత
- సబ్సిడీపై డ్రిప్పు, స్ప్రింక్లర్ల పంపిణీ



మహిళా రైతుకు డ్రిప్పు మంజూరు పత్రాన్ని అందజేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

కొత్తచెరువు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తమది రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పిన వైఎస్ జగన్ గత ఐదేళ్లలో అన్నదాతకు అన్నివిధాలా ద్రోహం చేశాడని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత మండిపడ్డారు. సబ్సిడీపై మంజూరైన డ్రిప్పు, స్ప్రింక్లర్ పరికరాలను స్థానిక మార్కెట్‌యార్డులో శుక్రవారం రైతులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డితో కలిసి మంత్రి పచ్చజెండా ఊపి, సబ్సిడీ పరికరాలను తరలించే వాహనాలను ప్రారంభించారు. అనంతరం రైతులకు మంజూరైన డ్రిప్పు, స్ప్రింక్లర్ పరికరాల మంజూరుపత్రాన్ని అందజేశారు. మంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ వ్యవసాయంలో నూతన ఒరవడులకు శ్రీకారం చుట్టారన్నారు. డ్రిప్పు, స్ప్రింక్లర్ పరికరాలను రైతులకు మొదటిసారిగా సబ్సిడీపై అందించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులకు ఎలాంటి సబ్సిడీ పరికరాలు అందించలేదని గుర్తు చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించి రైతుల మెడలకు ఉరితాళ్లు వేయాలని జగన్ ప్రయత్నించాడన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే రైతులకు సబ్సిడీపై డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందజేస్తున్నామన్నారు. జిల్లాలో లక్షల హెక్టార్లకు డ్రిప్పు పరికాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటివరకు 3,885 హెక్టార్ల విస్తీర్ణంలో 3504 మంది రైతులకు డ్రిప్పు, స్ప్రింక్లర్ పరికరాలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, కంపెనీ ప్రతినిధులు, ఏఓ నటరాజ్, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా రాజేశ్వరి

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా రాజేశ్వరి ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షురాలిగా బత్తలపల్లికి చెందిన రాజేశ్వరి, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మీదేవి (చిలమత్తూరు), కార్యదర్శిగా సీతారామలక్ష్మి (తాడిమర్రి), ఉప కార్యదర్శిగా సుకన్య (రామగిరి), కోశాధికారిగా వనజ (నల్లమాడ) ఎన్నికయ్యారు. మరో ఐదుగురు సభ్యులను ఎన్నుకున్నట్లు జిల్లా సమాఖ్య మునుపటి అధ్యక్షురాలు సిద్దగంగమ్మ తెలిపారు.



తాళం వేసిన ఇంటి ముందు కూర్చున్న నేత్రావతి, పిల్లలు

మహిళా సర్పంచ్‌కు అత్తింటి వేధింపులు

- అనారోగ్యంతో భర్త మృతి
- ఇంట్లోకి రానివ్వని అత్తమామలు
- తాళం వేసి ఇబ్బందులు
- ఇద్దరు బిడ్డలతో సర్పంచ్ నిరసన

లేపాక్షి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళా సర్పంచ్‌కే అత్తింటి వేధింపులు తప్పలేదు. భర్త మృతితో పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆమెను అత్తమామలు, వారి పిల్లలు వేధించసాగారు. ఇంట్లోకి రావద్దంటూ బయటకు పంపారు. ఇంటికి తాళం వేయడంతో ఇద్దరు కుమార్తెలతో కలిసి మహిళా సర్పంచ్ నిరసనకు దిగారు. మండలంలోని శిరివరం గ్రామ పంచాయతీ మహిళా సర్పంచ్ నేత్రావతి దుస్థితి ఇది. ఆమె భర్త శ్రీనివాసులు గతేడాది మార్చిలో అనారోగ్యంతో మృతిచెందారు. అప్పటి నుంచి ఉమ్మడిగా ఉన్న కుటుంబంలో అత్తమామలు చెన్నమ్మ, జయన్నతోపాటు వారి కుమారుల నుంచి సర్పంచ్ నేత్రావతికి వేధింపులు మొదలయ్యాయి. వేరుగా ఉండాలని గొడవకు దిగుతున్నారని బాధితురాలు వాపోయారు. ఐదు నెలల క్రితం ఇదే గ్రామంలో ఇంటిని అద్దెకు తీసుకుని, బిడ్డలతో కలిసి వేరుగా ఉంటున్నారు. అద్దె ఇంట్లో సౌకర్యాలు సరిగా లేకపోవడంతో భర్త ఇంట్లోనే వంట వండుకుని, స్నానాలు చేసేవారు. ఇటీవల ఇంట్లోకి రాకూడదంటూ అత్తమామలు, వారి కుమారులు గొడవ చేశారు. ఇంటికి తాళం వేసుకున్నారు. దీంతో సర్పంచ్ ఈనెల 5వ తేదీన ఆ ఇంటి ముందు నిరసన చేపట్టారు. ఆ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. తన వాటా తనకు ఇవ్వాలంటూ నేత్రావతి.. గ్రామంలో పెద్దమనుషుల వద్ద పంచాయితీ పెట్టినా న్యాయం చేకూరలేదు. దీంతో ఆమెను ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. ప్రైవేటు పాఠశాలలో చదివుతున్న కుమార్తెలు స్ఫూర్తి (8వ తరగతి), స్పందన (6వ తరగతి)ని స్థోమతలేక స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె వేడుకుంటున్నారు.

ఫిర్యాదు అందలేదు: నరేంద్ర, ఎస్ఐ, లేపాక్షి

శిరివరం గ్రామ సర్పంచ్ నేత్రావతికి వేధింపులపై ఫిర్యాదు అందలేదు. సోషల్ మీడియా ప్రచారం మేరకు గ్రామంలో విచారిస్తున్నాం. బాధితురాలికి న్యాయం చేస్తాం.

అర్జీల వెల్లువ

- రెవెన్యూ సదస్సులకు విశేష స్పందన
- క్యూకట్టిన అర్జీదారులు



నాగినాయనిచెరువులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న మంత్రి సవిత

పుట్టపర్తి టౌన్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): భూవివాదాల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులకు జిల్లాలో అర్జీలు వెల్లువెత్తాయి. శుక్రవారం రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. తొలిరోజు అర్జీదారులు క్యూకట్టారు. సోమందేపల్లి మండలంలోని నాగినాయనిచెరువు గ్రామంలో నిర్వహించిన సదస్సులో మంత్రి సవిత, కలెక్టర్ టీఎస్ చేతన్ పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. బత్తలపల్లి మండలంలోని మాల్యవంతం గ్రామంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పాల్గొని, అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. పుట్టపర్తి మండలంలోని కోట్లపల్లి సదస్సులో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మడకశిర మండలంలోని ఛత్రం గ్రామంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, చెన్నేకొత్తపల్లి మండలంలోని కనుముక్కల గ్రామ రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొని, అర్జీలు స్వీకరించారు. రికార్డుల్లో తప్పులు, భూకొలతల్లో తేడాలు, వారసత్వ పేర్ల నమోదు, సర్వే నంబర్ల మార్పు తదితర భూ సమస్యలపై ఫిర్యాదులు అందాయి. ఈసదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆర్‌టీజీఎస్ పోర్టల్‌లో నమోదుచేసి, 40రోజుల్లోగా పరిష్కరిస్తారు. ఈమేరకు ప్రతి అర్జీదారుడికి అధికారులు సమాచారం అందిస్తారు.

భూసమస్యలు పరిష్కరించుకోండి
- కలెక్టర్ టీఎస్ చేతన్

రెవెన్యూ సదస్సుల్లో దీర్ఘకాలిక భూసమస్యలను ప్రజలు, రైతులు పరిష్కరించుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం ప్రకటనలో కోరారు. జనవరి 8వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తామన్నారు. సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేసి, పరిష్కరించుకోవాలన్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులు సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఫిర్యాదుదారుడి మొబైల్ ఫోన్‌కు సమాచారం అందించాలన్నారు. సమస్యలు పునరావృతం రాకుండా అధికారులు జాగ్రత్త తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి
- మంత్రి సవిత పిలుపు

సోమందేపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీసీ సంక్షేమ, చేనేతజౌళి శాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. మండలంలోని నాగినాయనిచెరువు గ్రామంలో గల స్వయం సహాయక సంఘాల భవనం ఆవరణలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి మంత్రి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. భూ వివాదాలు, కొలతల్లో తేడాలు, సర్వే నంబర్లలో మార్పులు, వారసత్వపు పేర్ల నమోదు రికార్డులో మార్పు, రీసర్వే ద్వారా హద్దులు ఏర్పాటు చేయడం తదితర సమస్యలను 45 రోజుల్లోపే పరిష్కరిస్తామన్నారు. వ్యవసాయశాఖ అధికారులు గ్రామసభకు హాజరు కావడంలేదని రైతులు.. మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం నల్లగొండ్రాయనపల్లి వద్ద రోడ్డుపై వరిధాన్యాన్ని ఆరబోసుకుంటున్న రైతులతో మంత్రి మాట్లాడారు. తుఫాను ప్రభావంతో వరిపంట నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ చేతన్, ఆర్డీఓ ఆనంద్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి అశ్వత్థనాయక్, ఇన్‌చార్జి తహసీల్దార్ రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా నగర సంకీర్తన

పుట్టపర్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా భక్తులు శుక్రవారం రాత్రి పట్టణ వీధుల్లో సత్యసాయి నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. పర్తియాత్ర పేరుతో 3వేల మంది భక్తులు ప్రశాంతి నిలయం చేరుకున్నారు. రాత్రి సత్యమ్మగుడి వద్ద సత్యసాయి రథానికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తిపాటలు పాడుతూ రథాన్ని లాగారు. మహిళా భక్తులు బోనాలతో నగర సంకీర్తనలో పాల్గొన్నారు. సత్యమ్మ గుడి వద్ద నుంచి ప్రశాంతినిలయం గణేశ్ గేటు వరకు కనులపండువగా నగర సంకీర్తనసాగింది. మరో రెండు రోజులపాటు సత్యసాయి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



బోనాలతో నగర సంకీర్తనలో పాల్గొన్న మహిళాభక్తులు



సత్యసాయి రథాన్ని లాగుతున్న భక్తులు

ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం

- ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ఏడీ-2కి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయుడిపై విద్యార్థులు దాడిచేయడం అమానుషమని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర అన్నారు. ఉపాధ్యాయుడిపై దాడిచేసి, ఆయన మరణానికి కారుకులైన విద్యార్థులపై చర్యలకు సిఫారసు చేయాలంటూ కొత్తచెరువులోని డీఈఓ కార్యాలయంలో విద్యాశాఖ ఏడీ-2 రామకృష్ణకు శుక్రవారం వినతిపత్రం అందచేశారు. చంద్ర మాట్లాడుతూ.. తరగతి గదిలో ఉపాధ్యాయుడు ఇజాజ్ అహమ్మద్‌పై విద్యార్థులు దాడిచేయడం, ఆయన మరణించడం బాధాకరమన్నారు. అందుకు కారకులైన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు సాయి, శివ, జయరాం, చంద్రమోహన్, అంజన్నమూర్తి,వెంకటనాయుడు, రాజశేఖర్ పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు ప్రశంసనీయం

ఎస్పీ రత్న



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హోంగార్డుల సేవలు ప్రశంసనీయమని ఎస్పీ రత్న పేర్కొన్నారు. స్థానిక శిరసాని పోలీసు పరేడ్ మైదానంలో 62వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై, గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. హోంగార్డు వ్యవస్థ ప్రస్తుతం పోలీసుశాఖలో కీలకంగా మారిందన్నారు. ప్రజలకు, పోలీసులకు హోంగార్డులు వారధిలా సేవలు అందిస్తున్నారన్నారు. పోలీసుశాఖలో హోంగార్డులు అంతర్భాగమన్నారు. హోంగార్డులకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకరావాలని ఎస్పీ సూచించారు. అనంతరం హోంగార్డు వ్యవస్థాపక దినోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్రీడాపోటీల విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

తూగో జిల్లాలో రోడ్డు ప్రమాదం

చుక్కలూరువాసి మృతి


శ్యామర్ల నరసింహులు(ఫైల్)

నల్లజర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం చుక్కలూరుకు చెందిన శ్యామర్ల నరసింహులు(30) మృతి చెందారు. దానిమ్మ పండ్ల లోడ్‌తో నరసింహులు అనంతపురం నుంచి రాజమహేంద్రవరం వెళుతుండగా.. దూబచర్ల వద్ద వ్యాన్ ముందు టైరు పేలి అదుపు తప్పింది. డివైడర్ అవతల వైపునకు దూసుకెళ్లి.. ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నరసింహులు అక్కడిక్కడ మృతి చెందారు. వ్యాన్ నుజ్జునుజ్జు అయ్యింది. దానిమ్మకాయల లోడు రోడ్డుపై పడిపోవడంతో స్థానికులు కాయల కోసం ఎగబడ్డారు. నరసింహులుకు భార్య మహాలక్ష్మి, కుమారుడు మనోజ్ ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సోమరాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ప్రమాదంలో నుజ్జయిన వ్యాన్

లాభాల నేరేడు

పండ్లతో జ్యూస్, జామూన్ తయారీ


బాక్సులలో నిలువ ఉన్న నేరేడు పండ్లు

ఎనిమిదేళ్ల కష్టం...

ఏడాదిలో జూన్, జూలై దిగుబడి బాగా వస్తుంది. మార్కెట్లో నేరేడు పండ్లకు మంచి ధర ఉంటే వాటినే నేరుగా విక్రయిస్తాం. మార్కెట్లో ధర లేనప్పుడు వాటిని జ్యూస్, జామూన్, పౌడర్ తయారు చేస్తాం. అప్పుడు 45రోజుల పాటు కూలీలతో పని ఉంటుంది. అప్పుడు ఒక్కో కూలీకి రోజుకు రూ. వెయ్యి కూలి ఇస్తాం. రూ. 30 లక్షల విలువైన యంత్రాలను తెచ్చుకున్నాను. వాటితో తయారు చేసిన జ్యూస్, జా మూన్, పౌడర్‌ను గాజు సీసాను నిల్వ ఉంచుతాం. ఏడాది వరకు ఏమీ కాదు. ఎప్పుడు ఆర్డర్ వస్తే అప్పుడు వాటిని ఎగుమతి చేస్తాం. గత ఏడాది ఐదు టన్నుల నేరేడు జ్యూస్, జామూన్ తయారీ చేసి ఇతర ప్రాంతాలకు విక్రయించాను. ఈసారి మరికొంతమంది రైతులు సాగు చేసిన నేరేడు పండ్లను కొనుగోలు చేసి దాదాపు 22 టన్నుల జ్యూస్ చేసి అమ్మకాలు చేశాను. ఎనిమిదేళ్లుగా అనేక ప్రయోగాలు చేసి ఒడిదొడుకులను ఎదుర్కొని విజయం సాధించాను. వివాహాలు, ఇతర కార్యక్రమల్లో నేరేడు జ్యూస్‌ను ఉచితంగా పంపిణీ చేసి మార్కెట్లో పేరు సంపాదించాను. నేరేడు జ్యూస్ తయారీకి ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఇక్కడ ఉండే యువతకు మరింత ఉపాధి లభిస్తుంది. జ్యూస్ తయారీ పరిశ్రమలో యువతకు పని లభిస్తుంది.

- మారుతి ప్రసాద్, నేరేడు రైతు, ఉద్దేహాళ్


నేరేడు పండ్లతో తయారు చేసిన జ్యూస్, జామూన్

అల్లనేరేడు పండిస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నాడు బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ రైతు మారుతి ప్రసాద్. 2008లో తన రెండు ఎకరాల్లో 150 అల్లం నేరేడు చెట్లు వేశాడు. మూడేళ్ల నుంచి పంట దిగుబడి వస్తోంది. అయితే ఈ పంట జూన్, జూలై మాసాల్లో దిగుబడి వస్తుంది. ఒక్కొక్కసారి వచ్చిన పంటకు సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో నష్టపోయాడు. దీంతో ఈ కష్టాలను గట్టెక్కడానికి కొత్తగా ఆలోచించాడు. ఆ నేరేడు పండ్లతో జ్యూస్, జామూన్, పౌడర్ తయారు చేయడం ప్రారంభించాడు. దీంతో అధిక లాభాలు పొందాడు. -ఆంధ్రజ్యోతి, బొమ్మనహాళ్

- ఎనిమిదేళ్ల కష్టం..
- రెండేళ్లుగా ఫలితం
- ఉద్దేహాళ్ నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
- ప్రభుత్వం సహకరిస్తే మరింతమందికి ఉపాధి


దిగుబడిని చూస్తున్న మారుతిప్రసాద్

ప్రయోజనాలు అనేకం..

సహజంగా పండిన నేరేడు పండ్లు, ప్రకృతి సిద్ధమైన పదార్థాలతో తయారైన జామూన్ పౌడర్ వాడటం వల్ల మధుమేహం అదుపులో ఉంటుంది. బ్లడ్ షుగర్ స్థాయిల హెచ్చుతగ్గులను నియంత్రిస్తుంది. జామూన్, జ్యూస్, జామూన్ క్యాప్సూల్స్‌తో పాటు జామూన్ పౌడర్ కూడా ప్రభావంతంగా పనిచేస్తుంది. వీటిని వాడటం ద్వారా మంచి జీర్ణశక్తి, ఆరోగ్యం బాగుంటుంది. నేరేడు పండ్లు మంచి రుచిని అందించడమే కాకుండా శరీరానికి చాలా రకాల ప్రయోజనాలను కలిగిస్తాయి. ఇంకా వీటితో తయారు చేసిన జ్యూస్‌ను ఉపయోగించడం వల్ల మంచి ప్రయోజనాలు కలుగుతాయి. ఈ జ్యూస్‌లో పోషక గుణాలు లభించడమే కాకుండా శరీరాన్ని వ్యాధుల నుంచి సంరక్షించే శక్తి కూడా ఉంటుంది.


అరుంధతి నక్షత్రాన్ని చూపుతున్న వరుడు

ఫ్రాన్స్ యువతితో గొల్లపల్లి యువకుడి వివాహం

హిందూపురం అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలం గొల్లపల్లికి చెందిన సందీప్ యాదవ్ ఫ్రాన్స్ అమ్మాయి అడ్‌సవిన్‌ను శుక్రవారం వివాహం చేసుకున్నారు. హిందూపురం మండల పరిధిలోని తూమకుంట వద్ద ఉన్న ఓ ఫంక్షన్ హాలులో హిందూ సంప్రదాయం ప్రకారం వీరు ఒక్కటయ్యారు. గొల్లపల్లి రైతు కేశప్ప, గంగమ్మ దంపతుల 11వ సంతానం సందీప్ యాదవ్. ముంబయి ఐఐటీలో పీహెచ్‌డీ పూర్తి చేసి, ఫ్రాన్స్‌లోని సీఎన్‌ఆర్ యూనివర్సిటీలో నానో ఫిజిక్స్ రీసర్చ్ సెంటర్‌లో సైంటిస్టుగా పని చేస్తున్నాడు. అక్కడే గూగుల్‌లో పనిచేస్తున్న అడ్‌సవిన్‌తో ప్రేమలో పడ్డాడు. రెండు కుటుంబాలవారు సమ్మతించడంతో పెళ్లిని ఘనంగా నిర్వహించారు. ఫ్రాన్స్ నుంచి వచ్చిన వధువు బంధువులు ఇక్కడి సంప్రదాయ దుస్తులను ధరించి వేడుకలలో పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.36



అనంతపురం రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.36తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 975 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.30, కనిష్ఠ ధర రూ.20 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.36వేలు



అనంతపురంరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.36,100, కనిష్ఠంగా రూ.14వేలు, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 26 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రెండోరోజూ న్యాయవాదుల దీక్ష

అనంతపురం క్రైం,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్‌డీపీఎస్ కోర్టు బదిలీపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి నిరసనగా రెండో రోజూ న్యాయవాదులు రిలే నిరాహారదీక్ష నిర్వహించారు. శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురుప్రసాద్, రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రిలే నిరహారదీక్ష కొనసాగింది. మహిళా న్యాయవాదులు దీక్షలో కూర్చున్నారు. జిల్లాలో ఎన్‌డీపీస్ కోర్టు ఉంచకుండా తిరుపతికి కేటాయించడం సబబు కాదన్నారు. వెంటనే ఈ విషయంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. దీక్షలో మహిళా న్యాయవాదులు పద్మజ, శశికళ, మనోరమ, వహీదా, లక్ష్మి, పద్మావతి, కవిత, జ్యోతి, ప్రియాంక, రాధ, అనుపమ, శాంతి, శ్రావణి, హేమావతి, ఉమా మహేశ్వరి, భాను, అనిత,దీప, నీరజ, మహేశ్వరి, చైతన్య, సుజాత, అలివేలమ్మ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్కేయూ అంతర్ కళాశాలల అథ్లెటిక్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్ చాంపియన్‌షిప్-2024 పోటీలు శనివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీరామ్ తెలిపారు. ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీలు హాజరవుతారన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

నార్పల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో లక్ష్మీనరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మూలవిరాట్‌కు ప్రాణ ప్రతిష్ఠ, పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు చేసి, కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.


ప్రతిష్ఠించిన లక్ష్మీనరసింహస్వామి విగ్రహం




టమోటాలను లోడ్ చేస్తున్న కూలీలు, రైతు కోటిరెడ్డి సాగు చేసిన టమోటా



- ఈ రంగాన్ని కాపాడుకోవాల్సిందే..
- రైతు కోటిరెడ్డి
- మూడెకరాల నుంచి 70 ఎకరాలకు
- **అన్నదాత విజయ ప్రస్థానం**

వ్యవసాయం కూడా పరిశ్రమే...



ప్రభుత్వం రాయితీలు ఇవ్వాల్సిందే

వ్యవసాయం కూడా పరిశ్రమే అంటారు తనకల్లు మండలం చీకటిమానుపల్లికి చెందిన రైతు కోటిరెడ్డి. ఎంతోమంది నైపుణ్యంలేని అసంఘటిత కార్మికులకు పని దొరికే ఏకైక పరిశ్రమ వ్యవసాయం అంటారాయన. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో రైతులకోసం పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందంటారు. వ్యవసాయ పరిశ్రమకు ప్రోత్సాహం అందిస్తే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఆయన గట్టిగా నమ్ముతారు. భూమిని, వ్యవసాయాన్ని చిత్తశుద్ధితో నమ్ముకుని, శ్రమనే ఆయుధంగా మలచుకుంటే వ్యవసాయంలో విజయం తప్పకుండా వరిస్తుందంటున్నారు. తండ్రి నుంచి వచ్చిన మూడెకరాల భూమి, రూ.3 వేల అప్పు నుంచి 70 ఎకరాలు కొని, మొత్తంలో వాణిజ్య పంటలు సాగుచేసే స్థాయికి చేరిన కోటిరెడ్డి విజయ ప్రస్థానం స్ఫూర్తిదాయకం. ఆయన సక్సెస్ స్టోరీ తెలుసుకుందాం.

తనకల్లు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిమానుపల్లికి చెందిన కోటిరెడ్డికి మూడు దశాబ్దాల క్రితం తండ్రి నుంచి మూడెకరాల భూమి వచ్చింది. దాంతోపాటు రూ.3 వేలు అప్పు భారం కూడా తప్పలేదు. ఆ రోజుల్లో భూమి విక్రయించినా అప్పు తీరదు. ఏం చేద్దామని కోటిరెడ్డి ఆలోచించారు. ఆఖరుకు భూమినే నమ్ముకుందామన్నారు. వ్యవసాయమే మార్గమనుకున్నారు. ఇతరుల పొలాలను కౌలుకు తీసుకుని, ప్రస్థానాన్ని ప్రారంభించారు. ప్రణాళికబద్ధంగా పంటలు సాగుచేస్తూ లాభాలు స్వీకరిస్తూ వచ్చారు. వాటిని పంటల సాగుకే పెట్టుబడిగా పెట్టారు. వ్యవసాయ భూములు కొంటూ వచ్చారు. అలా 70ఎకరాలు కొనుగోలు చేశారు. వాటిలో బోర్లు వేశారు. ప్రస్తుతం 70 ఎకరాల్లో టమోటా, దోస, కర్బూజా, బొప్పాయిలాంటి వాణిజ్య పంటలు సాగుచేస్తున్నారు. రోజూ 50మంది కూలీలకు తక్కువ కాకుండా ఉపాధి కల్పిస్తున్నారు. ఈలెక్కన ఏడాది పొడవునా 20 వేలమంది కూలీలకు పని చూపుతున్నారు. ఎకరంలో టమోటా సాగు చేయడానికి రూ.2లక్షలకుపైగా ఖర్చు వస్తున్నా, వెనకాడట్లేదు. 25 ఎకరాల్లో పంట సాగుచేస్తున్నారు. కోటిరెడ్డి తోట నుంచి రోజూ 300 నుంచి 500 దాకా టమోటా బాక్సులు మార్కెట్‌కు వెళ్తుంటాయి.

ఎందరు కూలీలు పనికి వచ్చినా, అందరికీ మధ్యాహ్న భోజనం ఇంట్లోనే వడ్డించి అందిస్తారు కోటిరెడ్డి. కూలీలు భోజనానికి ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతోనే మధ్యాహ్న భోజనం పెడుతున్నట్లు చెబుతారాయన. సొంత భూమి లేనపుడు భూములు కౌలుకు తీసుకుని, పంటలు సాగుచేశారు. ప్రస్తుతం సొంత భూముల్లో ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఓ వైపున పురుగు, క్రిమిసంహారక మందులు వినియోగిస్తున్నారు. మరోవైపు రైతుల నుంచి సేంద్రీయ ఎరువులు కొనుగోలు చేస్తున్నారు.

ప్రోత్సహించాలి

ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందంటున్నారు రైతు కోటిరెడ్డి. వ్యవసాయానికి ఉపాధి పథకాన్ని అనుసంధానం చేస్తే రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందంటారాయన. డ్రిప్పులు, స్ప్రింక్లర్లు, ఎరువులను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. గత 20 ఏళ్లలో కూలి ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పెట్టుబడి అధికమైందనీ, భరించలేక చాలామంది చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయాన్ని వదిలివేస్తున్నట్లు బాధపడ్డారు. ప్రస్తుతం కూలీలు దొరక్క, ఇతర ప్రాంతాలనుంచి ఆటోల్లో తీసుకురావాల్సిన దుస్థితి దాపురించిందని వాపోయారు. ప్రతి గ్రామంలో రైతులు, కూలీలు వలస బాట మాని వ్యవసాయంపై దృష్టి సారించాలని కోటిరెడ్డి కోరుతున్నారు.

అభివృద్ధికి అటవీశాఖ అడ్డు

దశాబ్దాలుగా ప్రగతి లేని తిమ్మమ్మ మర్రిమాను.. ఆ శాఖ స్వాధీనంలో భూములు

- మొక్కలు నాటడంతో సరి..
- అభివృద్ధి పనులు చేపట్టని అధికారులు
- ఇతర శాఖలవారిని అడ్డుకున్న సిబ్బంది
- ఏళ్లు గడుస్తున్నా.. మారని తీరు
- నేటికీ కనీస వసతులు కరువు
- పర్యాటకులకు తప్పని ఇబ్బందులు


రింగ్‌రోడ్డు పనులు నిలిపివేసిన దృశ్యం


తిమ్మమ్మ మర్రిమాను

ఉమ్మడి జిల్లాలో పెద్దగా పర్యాటక ప్రాంతాలు లేవు. ఉన్న వాటిల్లో నంబులపూలకుంట మండలం గూటిబైలు గ్రామ సమీపంలో ఉన్న తిమ్మమ్మ మర్రిమాను ప్రముఖమైంది. ప్రస్తుతం ఈ మర్రిచెట్టు తొమ్మిది ఎకరాలకు విస్తరించింది. అయితే ఈ ప్రాంతం దశాబ్దాలు గడిచి.. ఏ మాత్రం అభివృద్ధి చెందలేదు. రోడ్డు సౌకర్యమూ సరిగాలేదు. అక్కడ ఉండటానికి వసతులూ సరిగా లేవు. దీంతో పర్యాటకులు అక్కడ ఉండలేకపోతున్నారు. అటవీశాఖ అధికారుల వింత ధోరణి వల్లే ఈ ప్రాంతం అభివృద్ధి చెందడం లేదని, ఇతర శాఖల వాళ్లు ఇక్కడ అభివృద్ధి పనులు చేస్తుంటే అడ్డుకొంటున్నారని స్థానికులు వాపోతున్నారు.

నంబులపూలకుంట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):తిమ్మమ్మ మర్రిమాను.. అనేక సంవత్సరాల క్రితమే ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. అంత ప్రముఖమైన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి.. పర్యాటకులను ఆకర్షించేలా చేయాల్సిన అటవీశాఖ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు సరికదా... ఇతర శాఖల వారు అభివృద్ధి చేయడానికి వస్తే అడ్డుకొంటున్నారు. ఆ ప్రాంతమంతా అటవీశాఖ వారి ఆధీనంలో ఉంది. దీంతో ఆ ప్రాంతంలో కేవలం మొక్కలు నాటడం తప్పా.. మరే ఇతర పనులూ చేపట్టరాదని తేల్చిచెబుతున్నారు. దీంతో ఏళ్ల తరబడి ఆ ప్రాంతంలో ఎటువంటి అభివృద్ధి పనులూ జరగలేదు. దీంతో తిమ్మమ్మ మర్రిమాను పరిస్థితి పేరు గొప్ప.. ఊరు దిబ్బలా తయారైంది. ప్రపంచ ఖ్యాతి గాంచిన ఈ ప్రాంతం అభివృద్ధికి.. అటవీశాఖే అడ్డుపడుతుండటం విడ్డూరంగా ఉంది.

స్థల చరిత్ర

క్రీస్తుశకం 1315లో బుక్కపట్నంకు చెందిన వెంకటప్ప, మంగమ్మ దంపతులకు తిమ్మమాంబ (తిమ్మమ్మ) జన్మించింది. 1335లో నంబులపూలకుంట మండలంలో గూటిబైలు గ్రామానికి చెందిన రామయ్య, లక్ష్మమ్మ కుమారుడు బాలవీరయ్యతో ఆమెకు వివాహమైంది. పెళ్లిన 15ఏళ్లకు బాలవీరయ్య కుష్టు వ్యాధి బారిన పడతాడు. దీంతో గ్రామస్థులు ఆ దంపతులను గ్రామ బహిష్కరణ చేశారు. ఏడేళ్ల పాటు తిమ్మమాంబ భర్తకు సేవలు చేసింది. 1355లో బాలవీరయ్య మృతిచెందారు. అప్పటి ఆచారం ప్రకారం తిమ్మమాంబ సతీసహగమనం చేసింది. ఆమెను సజీవదహనం చేసుకున్న ప్రాతంలో ఎండిని ఓ మర్రి కొమ్మను నాటారు. ఆ కొమ్మ బతికి చెట్టు అయింది. మర్రి చెట్టు ఊడలు విస్తరించారు. ఈప్రాంతంలో తిమ్మమాంబ అమ్మవారి విగ్రహాన్నీ ఏర్పాటు చేశారు.

వెలుగులోకి ఇలా..

కర్ణాటక రాష్ట్రం ములబాగ తాలూకా, దేవరాయిసముద్రం వాసి, జర్నలిస్ట్ సత్యనారాయణ అయ్యార్ 1989లో ఆ మర్రిమానను సందర్శించారు. ఆ సమయంలో ఆ వృక్షం ఏడు ఎకరాలు విస్తరించి ఉండటాన్ని గుర్తించి.. ఆ మాను జీవిత చరిత్రపై అధ్యాయనం చేశాడు. దానిపై కథనాలు రాయడంతో ఆ మర్రిమాను గురించి ప్రపంచానికి తెల్సింది. ఆ మర్రిమానును గిన్నీస్ రికార్డుగా గుర్తించారు. దీంతో భారత ప్రభుత్వం సత్యనారాయణ అయ్యార్‌కు దిగ్రేట్ అయ్యార్ అనే బిరుదు కూడా ఇచ్చి .. సన్మానించింది. ప్రస్తుతం ఆ చెట్టు తొమ్మిది ఎకరాలకు విస్తరించింది.

అభివృద్ధికి అడ్డు

- మొదట తిమ్మమ్మ మర్రిమానును తిరుమల తిరుపతి దేవస్థానంలో విలీనం చేసుకోవడానికి ముందుకొచ్చింది. ఆ ప్రాంతం అభివృద్ధికి నిధులు కూడా ఇస్తామని ప్రకటించింది. అయితే తిమ్మమాంబ సమాధి ఉండటంతో.. హైందవ సిద్ధంతం ప్రకారం ఆ ప్రాంతాన్ని విలీనం చేసుకోవాడానికి నిరాకరించింది.
- మర్రిమాను వెనుకభాగంలో ఎత్తైన ఓబుళదేవరకొండపైన బాలాజీ ఆలయం, నిర్మించడానికి ప్రయత్నించినా.. ఆ పనులూ అర్థాంతరంగా ఆగిపోయాయి. ప్రస్తుతం ఆలయ కమిటీసభ్యులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆ ఆలయంలో బాలాజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి యత్నిస్తున్నారు.
- తిమ్మమ్మ మర్రిమాను చుట్టూ రింగ్ రోడ్డు ఏర్పాటు చేయడానికి అప్పట్లో భూ సేకరణ చేశారు. 1995లో అప్పటి కదిరి ఎమ్మెల్యే జొన్నా సూర్యనారాయణ రింగ్‌రోడ్డు విస్తర్ణలో భాగంగా రైతుల నుంచి భూసేకరణ చేశారు. తర్వాత ఆ విషయం మరుగున పడింది. ఇటీవల మళ్లీ ఈ రింగ్ రోడ్డు నిర్మాణానికి పర్యాటక శాఖ రూ.85 లక్షలు విడుదల చేసింది. ఆ పనులు చేపట్టగా... అటవీశాఖాధికారులు అడ్డుకున్నారు. ఈ స్థలం అటవీశాఖ పరిధిలో ఉందని, ఇక్కడ మొక్కలు నాటడం తప్పా.. ఎలాంటి అభివృద్ధి పనులూ చేపట్టరాదని హెచ్చరించింది. దీంతో ఆ పనులు ఆగిపోయాయి. ఇన్నేళ్లకు తమ గ్రామాలకు మంచి రోడ్డు వస్తోందని ఆశించిన.. ఆ చుట్టుపక్కల గ్రామస్థులకు మళ్లీ నిరాశే మిగిలింది.
- ఏటా మహాశివరాత్రి సమయంలో మూడు రోజుల పాటు తిమ్మమాంబ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. ఉత్సవాలకు స్థలం చాలట్లేదనీ, మూడెకరాలు కేటాంచాలని ఉత్సవ కమిటీ సభ్యులు.. అటవీ అధికారులను విజ్ఞప్తి చేసినా వారు ససేమిరా అన్నారు.

కూటమి చొరవ

తిమ్మమ్మ మర్రిమాను సందర్శనకు వచ్చిన వారు ఉండడానికి విశ్రాంతి గదులు లేవు. మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా లేవు. తిమ్మమ్మ మర్రిమాను అభివృద్ధి గురించి గత వైసీపీ హయాంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు పలు మార్లు నాయకులను విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో ఈ సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం సర్పంచ్ ఆధ్వర్యంలో గెస్టు హౌస్, హోటల్‌ను 15 సంవత్సరాలు లీజుకు తీసుకుని నిర్వహించడానికి ముందుకువచ్చారు. దీంతో భవనాలకు రంగులు వేసి, మెరుగులు దిద్దుతున్నారు.

పొలాలిచ్చాం..



తిమ్మమ్మ మర్రిమాను అభివృద్ధి కోసం పొలాలు ఇచ్చాం. ఏళ్లు గడుస్తున్నా అటవీ అధికారులు ఎలాంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదు. తమ పొలాలకు వెళ్లడానికి కూడా రహదారి లేకుండా చేశారు. ఆ అధికారులు ఆ ప్రాంతంలో మొక్కలు నాటడంపై చూపుతున్న శ్రద్ధలో కొంతకూడా మర్రిమాను అభివృద్ధిపై చూపడం లేదు. ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పిస్తే.. మరింతమంది సందర్శకులు వచ్చే అవకాశముంది.

- విష్ణుమూర్తి, సర్పంచ్

వసతులు కల్పించాలి



తిమ్మమ్మ మర్రిమాను ప్రాంతంలో సందర్శకులు బస చేయడానికి గదులు లేవు. కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. అలాగే ఈ ప్రాంతంలో బస్ షెల్టర్ కూడా లేదు. సందర్శకులు వస్తే కనీసం కొద్ది సేపు కూర్చొడానికి వసతి కూడా లేదు. ఏదో ఒక వాహనం పట్టుకుని వెళ్లిపోవాల్సిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

- మనోహర్, టూరిజం గైడ్

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో మహిళ మృతి


వరలక్ష్మి (ఫైల్)

తాడిపత్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన వరలక్ష్మి (54) విద్యుత్‌షాక్‌తో శుక్రవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వరలక్ష్మి, ఓబులేసుయాదవ్ దంపతులు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరు ఆవులు కూడా పెంచుతున్నారు. ఆవులకు ప్రతిరోజూ వరలక్ష్మి రైస్‌కుక్కర్‌పై అన్నం వండి పెడుతుండేది. ఇందులో భాగంగానే శుక్రవారం తెల్లవారుజామున నిద్రలేచి ఆవులకు అన్నం పెట్టేందుకు రైస్ కుక్కర్‌పై అన్నం పెట్టింది. అన్నం ఉడికిన తర్వాత పక్కకు పెట్టాలన్న ఆలోచనతో మూతతీసేందుకు ప్రయత్నించింది. ఒక్కసారిగా విద్యుత్ ప్రసరించడంతో షాక్ కొట్టింది. అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయింది. గమనించిన భర్త చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వరలక్ష్మికి కుమారుడు సందీప్‌కుమార్, కుమార్తె మంజులభార్గవి ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

కూలీ ఆత్మహత్య

అనంతపురం క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన ఓ కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం రూరల్ మండలం పాములాయికి చెందిన రామాంజనేయులు (29) కూలి పనిచేస్తూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఎంత ప్రయత్నించినా మానలేకపోయాడు. ఈ క్రమంలో మనస్తాపంచెంది శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడికి భార్య సంధ్య, రెండేళ్ల పాప ఉన్నారు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం


భానుప్రకాష్ (ఫైల్)

గార్లదిన్నె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తాడు గ్రామానికి చెందిన కుమ్మర భానుప్రకాష్ అనే యువకుడు కనిపించకుండా పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. గ్రామానికి చెందిన కుమ్మర రాము, భాగ్యమ్మ దంపతులు గ్రామంలోనే కులవృత్తి చేసుకుంటూ జీవించేవారు. కుమ్మర రాము కొంతకాలం కిందట మృతి చెందాడు. ఇంటర్ వరకు చదివిన భానుప్రకాష్ తల్లికి తోడుగా ఇంటివద్దనే కుమ్మర వృత్తిని చేస్తుండేవాడు. రెండు రోజుల కిందట భాగ్యమ్మ గుంతకల్లులో బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి వెళ్లింది. తర్వాత ఆమె ఇంటికి తిరిగా రాగా కుమారుడు భానుప్రకాష్ కనిపించలేదు. దీంతో గ్రామంలోను, బంధువుల ఊళ్లలోనూ వెదికినా ఆచూకి కనిపించకపోవడంతో గురువారం రాత్రి గార్లదిన్నె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

పెళ్లిలో చోరీ

● 38 తులాల వడ్డాణాల అపహరణ

పామిడి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్నానది ఒడ్డున ఉన్న ఓ ఫంక్షన్ హాలులో శుక్రవారం జరుగుతున్న పెళ్లిలో చోరీ జరిగింది. సీఐ యుగంధర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని రామరాజుపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి కుమార్తె రోషిణి వివాహం పెన్నానది ఒడ్డున ఉన్న ఓ ఫంక్షన్ హాలులో జరుగుతోంది. పెళ్లి కుమార్తె అక్క శృతికి చెందిన రూ.25లక్షల విలువైన 38 తులాల రెండు వడ్డాణాలు చోరీకి గురైనట్లు సీఐ తెలిపారు. రాత్రి రిసెప్షన్‌కు వేసుకొని గదిలో భద్రపరిచిందన్నారు. ఉదయం కనిపించకపోవడంతో భయాందోళనకు గురయ్యారన్నారు. సింగిల్ విండో మాజీ డైరెక్టర్ ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదుపై వెంటనే స్పందించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో బీజేపీ నాయకుడి మృతి

హిందూపురం అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీజేపీ నాయకుడు అంజినరెడ్డి గురువారం మృతి చెందారు. రెండు రోజుల క్రితం తన పొలంలో నుంచి మడకశిర జాతీయ రహదారిపైకి ద్విచక్ర వాహనంలో రావడంతో అటుగా ద్విచక్రవాహనంపై ముగ్గురు యువకులు వేగంగా వచ్చి ఢీకొట్టారు. ఈ ఘటనలో అంజినరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. బెంగళూరుకు తరలించి చికిత్సలు అందించగా ఫలించక మృతి చెందారు. మృతదేహానికి సొంత గ్రామమైన సింగిరెడ్డిపల్లిలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. అంజనరెడ్డి హిందూపురం అసెంబ్లీ బీజేపీ కన్వీనర్‌గా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పార్టీకి సేవచేశారు. బీజేపీ నాయకులు పార్థసారథి, రమేష్‌రెడ్డి, చంద్రశేఖర్, ఆదర్శ్, దివాకర్, చలపతి, చంద్ర, చంద్రశేఖర్, బద్రీ, వెంకటనరామిరెడ్డి తదితరులు హాజరై బీజేపీ జెండా మృతదేహంపై కప్పి నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పుట్టిన తేదీతో... పుట్టెడు కష్టాలు..!

- పేరు, పుట్టిన తేదీ మార్పునకు ఇబ్బందులు
- ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ
- పట్టించుకోని అధికారులు

గుత్తి రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన అపార్ కార్డు విద్యార్థులు వారి తల్లిదండ్రులను ముప్పు తిప్పలు పెడుతోంది. ఆరువారాలుగా పాఠశాల, గ్రామసచివాలయాలు, తహసీల్దార్, కార్యాలయాలు, ఆధార్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావాడం లేదు. పాఠశాల రికార్డుల్లోనూ, ఆధార్‌కార్డులోనూ, ఒకేవిధంగా వివరాలుంటేనే అపార్ కార్డు జనరేట్ అవుతోంది. ఈ రెండు చోట్ల వివరాలు ఒకే విధంగా మార్పు చేయడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు అన్ని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకపోవడంతో వారి చదువులు వెనకబడుతున్నాయి. పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఒత్తిళ్లు తెస్తుండటంతో వారు ఏం చేయాలో అర్థంకాక అయోమయంలో పడుతున్నారు. అపార్ కార్డు జనరేట్ కావాలంటే పాఠశాల రికార్డుల్లోనూ, ఆధార్‌కార్డులోనూ ఇంటి పేరు ఒకేరకంగా ఉండాలి. సాధారణంగా పాఠశాలలో ఇంటిపేరుతో పాటు


న్యాయవాది వద్ద అఫిడవిట్ కోసం బారులుతీరిన తల్లిదండ్రులు


ఆధార్ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

విద్యార్థి పేరు ఉంటుంది. కానీ ఆధార్‌కార్డులో వచ్చేపాటికి ఆ సమయంలో ఎక్కువ మంది ఇంటిపేరు పూర్తిగా కాకుండా మొదటి అక్షరం ఇన్షియల్ మాత్రమే పెట్టి నమోదు చేయించుకున్నారు. ప్రస్తుతం అపార్ కార్డు జనరేట్ కావాలంటే ఈ రెండు ఒకేరంగా ఉండాలి. చాలా మందికి రెండు చోట్ల ఒకే రకంగా పేరు ఉండకపోవడంతో అపార్ కార్డులు జనరేట్ కావడం లేదు. ఇంటిపేరు మార్చుకోవాలంటే మొదట జనన ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. ఆ పత్రం కోసం సచివాలయంలో వివరాలు రాసిస్తే వారు తహసీల్దార్‌కు పంపుతారు. అక్కడ నమోదై ఉంటే ధ్రువీకరణ పత్రం ఇస్తారు. ఒకవేళ విద్యార్థి పుట్టినపుడు ఎక్కడా నమోదు చేయకపోతే నాన్ అవైలబుల్ అనే సర్టిఫికెట్‌ను ఆర్డీఓ జారీ చేస్తారు. అక్కడి నుంచి తిరిగి సచివాలయం, తహసీల్దార్ కార్యాలయానికి పంపితే అక్కడ జనన ధ్రువీకరణ పత్రం ఇంటిపేరుతో ఇస్తారు. ఈతతంగం పూర్తి కావాలంటే కనీసం 15 నుంచి 20 రోజులు పడుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ఇంటిపేరు ఆధార్‌కార్డులో తప్పు ఉండడంతో సరి చేసేందుకు రెండు రోజులుగా ఆధార్ కేంద్రం వద్దకు వస్తున్నా బర్త్ సర్టిఫికెట్ కోసం గుత్తి మున్సిపాలిటీలో ఇవ్వడంతో ఇంటిపేరు కుడా ఇక్కడే మార్చుకోవాలని ఆధార్ సెంటర్‌వారు చెబుతున్నారు. ఇక్కడ మున్సిపాలిటీలో పనికావడంలేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం.

\- పెద్దక్క, గుత్తి అనంతపురం

నాలుగుసార్లు తిరిగినా పని కావడంలేదు



నాకుమారుడు ఇక్కడే పుట్టాడు. అప్పట్లో నల్లదానరిపల్లి అని కొట్టకుండా కొజ్జేపల్లి అని జనన ధ్రువీకరణ పత్రంలో ముద్రించారు. ఇప్పటికీ గుంతకల్లు నుంచి నాలుగుసార్లు తిరిగినా పనికావడం లేదు. ఎప్పుడు వచ్చినా చూస్తామంటారు కానీ పని మాత్రం చేయలేదు. పనులు వదులుకొని తిరుగతుఉన్నాం.

\- ప్రసాద్, నల్లదాసరిపల్లి

సందిగ్ధం..!

- కొత్త రేషన్‌కార్డుల జారీపై స్పష్టత కరువు
- సచివాలయాలకు వెళ్తున్న అర్హులు
- దరఖాస్తులు స్వీకరించని వైనం
- మార్గదర్శకాలు రాలేదంటున్న సిబ్బంది

ధర్మవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల జారీపై సందిగ్ధం నెలకొంది. ప్రభుత్వం ఈనెల 2వతేదీ నుంచి సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించనున్నట్లు ఇదివరకే ప్రకటించింది. దీంతో ఆశావహులు సచివాలయాలకు పెద్దసంఖ్యలో చేరుకుని, దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సచివాలయాల్లో వారం రోజులుగా ఇందుకు సంబంధించిన యాప్ ఓపెన్ కాకపోవడం, ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు సైతం రాకపోవడంతో ఆశావహులకు ఏం చెప్పాలో తెలియని అయోమయ పరిస్థితిలో సచివాలయ సిబ్బంది ఉంటున్నారు.

సంక్రాంతికి కొత్తకార్డులంటూ..

డిసెంబరు 2 నుంచి 28వ తేదీ వరకూ అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో కొత్త రేషన్‌కార్డుల జారీ, మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించబోతోందనీ, కొత్త డిజైన్లతో పంపిణీ చేయనుందని కొన్ని రోజులుగా అధికార యంత్రాంగం ప్రచారం చేస్తోంది. సంక్రాంతి పండుగకే కొత్త కార్డులు అందజేస్తుందని కూడా కొందరు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ కాలేదు. దీంతో దరఖాస్తుదారులకు ఏం చెప్పాలోనని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. దరఖాస్తులు స్వీకరించాలో.. వద్దో కూడా తెలియని పరిస్థితి.

పది నెలలుగా పెండింగ్

పది నెలలుగా కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాల్లో స్వీకరించడంలేదు. ఇందుకు సంబంధించి ఈ-పోస్ సైట్‌ను బ్లాక్ చేశారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో వచ్చిన దరఖాస్తులు వందల్లో పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారుల ద్వారా తెలుస్తోంది. ఆ తరువాత ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రేషన్ కార్డులకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించడం లేదు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. వైసీపీ రంగులతో ఉన్న రేషన్‌కార్డులను తొలగించాలని నిర్ణయించింది. గత టీడీపీ హయాంలో జారీ చేసిన రేషన్ కార్డుల్లో మొత్తం కుటుంబసభ్యుల ఫొటో ఉండేది. అలానే కుటుంబ పెద్ద, వృత్తి, పుట్టినతేదీ, వయసు, వార్షికాదాయం వంటి వివరాలు ఉండేవి. గత వైసీపీ ప్రభుత్వం వాటిని తొలగించి, రైస్‌కార్డులంటూ సచివాలయాల ద్వారా పంపిణీ చేసింది. ఆ కార్డుల్లో



కుటుంబసభ్యుల ఫొటో తీసేసింది. ఆ కుటుంబంలో మహిళ ఫొటోను మాత్రమే ఉంచింది. ఆ కార్డులను గుర్తింపు కార్డులుగా పరిగణించలేని పరిస్థితి.

నిరాశగా వెనుదిరుగుతూ..

కొత్తకార్డులు, స్ప్లిట్‌కార్డులు, ఇతర సవరణల కోసం పెట్టుకున్న దరఖాస్తులను గత ప్రభుత్వం నిలిపివేసింది. ఆరంచెల పరిశీలన ద్వారా వేలల్లో కార్డులను తొలగించింది. ఈ కారణంగా ఇప్పుడు వంటగ్యాస్ సబ్సిడీకి కూడా కొందరు దూరమయ్యారు. ఇతర సంక్షేమ పథకాలను పొందలేకపోయారు. శ్రీసత్యసాయి జిల్లాలో 5.72 లక్షల రేషన్‌కార్డులున్నాయి. ఇంకా అర్హులు మిగిలిపోవడంతో వారికి కార్డులు పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అందుకు సంబంధించి మార్గదర్శకాలు ప్రకటించలేదు. దీంతో సచివాలయాలకు దరఖాస్తులతో వస్తున్నవారు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

మార్గదర్శకాలు రాలేదు: వంశీకృష్ణారెడ్డి, డీఎస్ఓ

రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ కాలేదు. దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే ప్రక్రియ ప్రారంభిస్తాం.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

ఓబుళదేవరచెరువు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయపల్లి క్వార్టర్స్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో కదిరి పట్టణంలోని నిజాంవలీకాలనీకి చెందిన బీటెక్ విద్యార్థి తరుణ్‌సాయి (22) మృతిచెందాడు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తరుణ్‌సాయి బెంగుళూరులో బీటెక్ చదువుతుండేవాడు. గురువారం రాత్రి గోరంట్లకు చెందిన స్నేహితుడు ఉమేష్‌ను ద్విచక్రవాహనంపై వదిలి వెళ్లడానికి కదిరి నుంచి బయల్దేరాడు. బోయపల్లి వద్ద అదుపు తప్పి బైక్ బోల్తా పడింది. ప్రమాదంలో తరుణ్‌సాయి తలకు తీవ్రగాయాలయ్యాయి. కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ తరుణ్‌సాయి మృతిచెందాడు. విద్యార్థి తల్లి అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించారు. ఉమేష్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

ముగిసిన రైల్వే ఎన్నికల పోలింగ్

గుంతకల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగ సంఘం గుర్తింపు ఎన్నికల్లో భాగంగా పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. 4వ తేదీన దేశవ్యాప్తంగా రైల్వే ఉద్యోగ సంఘం గుర్తింపు కోసం ఎన్నికలను నిర్వహించారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో 34, డివిజనల్ కేంద్రంలో 6 పోలింగ్ బూత్‌లను ఏర్పాటుచేశారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పోలింగ్ కార్యక్రమం పూర్తయింది. మొత్తం 14,359 ఓట్లకు 12,358 ఓట్లు పోలయ్యాయి. 2001 ఓట్లు పోల్ కాలేదు. పోలింగ్‌లో 11,509 మంది పురుష ఓటర్లు, 849 మంది మహిళా ఓటర్లు ఓట్లువేశారు. 86.06 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులైన పర్సనల్ బ్రాంచ్ ఆఫీసర్లు తెలిపారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి
- రూరల్ క్రికెట్ లీగ్‌లో సెంచరీల మోత

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నప్పుడే సత్ఫలితాలు వస్తాయని క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి అన్నారు. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్తంగా శుక్రవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో అండర్-12 మిక్స్‌డ్ రూరల్ క్రికెట్ లీగ్-2024 క్వాలిఫయర్ మ్యాచ్‌లు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పీఎల్ ప్రకాష్‌రెడ్డి పోటీలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు అవకాశం కల్పించేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆంధ్రా, భారత్ జట్టుకు ప్రాతినిధ్యం కల్పించడమే లక్ష్యంగా క్రీడాకారులు, కోచ్‌లు, సభ్యులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. అనంతరం నిర్వహించిన అండర్-12లో మ్యాచ్‌లో రాప్తాడు, గుత్తి జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన గుత్తి 19.1 ఓవర్లలో 51పరుగులకే ఆలౌట్ అయ్యింది. తరుణిక, కాత్యాయని, ధన్యుత చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం స్వల్పలక్ష్యంతో బరిలోకి దిగిన రాప్తాడు 4.1ఓవర్లలో వికెట్ నష్టపోకుండా విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో ఆత్మకూరు, ధర్మవరం జట్ల మధ్య జరిగిన పోరులో మొదట బ్యాటింగ్ చేసిన ధర్మవరం నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 157 పరుగులు చేసింది. బ్యాటర్ గోవర్ధన్ 98 బంతుల్లో 12 బౌండరీలు, 12 సిక్సర్లతో 139 పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన ఆత్మకూరు 19.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 161 పరుగులు సాధించింది. ఇందులో గౌతమ్ 46పరుగులు చేశాడు. దీంతో ఆత్మకూరు 6వికెట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో తపోవనం క్రికెట్ అకాడమీ, గుంతకల్లు రైల్వేస్‌జట్లు తలపడగా టీసీఏ 40ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 307పరుగులు సాధించింది. కౌశిక్ 100పరుగులు, తన్మయి కార్తీక్‌రెడ్డి కేవలం 26బంతుల్లోనే 8బౌండరీలు, 6సిక్సర్లతో 77పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బరిలోకి దిగిన గుంతకల్లు రైల్వేస్ 33.4ఓవర్లలో 155పరుగులకు ఆలౌట్ అయ్యింది. దేవస్కంద, కుశాల్‌రాయల్ చెరో 3వికెట్లు పడగొట్టారు. తపోవనం క్రికెట్ అకాడమీ జట్టు 152 పరుగుల తేడాతో గెలుపొందింది. కార్యక్రమంలో చిత్తూరు క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ కుమార్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి, మేనేజర్ సాగర్‌చౌదరి, కోచ్‌లు వంశీకృష్ణ, ప్రవీణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీఎల్ ప్రకాష్ రెడ్డి


సెంచరీలు సాధించిన గోవర్ధన్, కౌశిక్, తన్మయి కార్తీక్

అంబేడ్కర్‌కు టీడీపీ నివాళి


అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఇతర నాయకులు

అనంతపురం డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం టీడీపీ నాయకులు నిర్వహించారు. నగరంలోని జడ్పీ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, మాజీ మేయర్ స్వరూప, ఇతర నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా అంబేడ్కర్ తరతరాలకు గుర్తుండిపోయే సేవలను అందించారని కొనియాడారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో జగన్‌రెడ్డి రాజ్యాంగం అమలు చేసి అన్ని వ్యవస్థలను విచ్ఛిన్నం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, గంగారామ్, విశాలాక్షి, స్వప్న, సరిపూటి రమణ, కూచి హరి పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తదితర నాయకులు

రైల్వే మెయిల్ సర్వీస్‌ను నిర్వీర్యం చేయడం తగదు


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎంతో చరిత్ర కలిగిన రైల్వే మెయిల్ సర్వీస్‌ను నిర్వీర్యం చేయడం తగదని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి జనార్దన్, యూనియన్ డివిజనల్ కార్యదర్శి జే శ్రీనివాసులు అన్నారు. మొదీనబాదులోని రైల్వే మెయిల్ సర్వీస్ కార్యాలయం వద్ద శుక్రవారం నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఇప్పటికే పోస్టల్ స్టోర్ డిపోను విజయవాడకు, సూపరింటెండెంట్ పోస్టాఫిసెస్‌ను అనంతపురానికి తరలించారని అన్నారు. ప్రస్తుతం రైల్వే మెయిల్ సర్వీస్‌ను ఇతర ప్రాంతాకు తరలించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అధికారులు వెంటనే ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకండి

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్


మాట్లాడుతున్న న్యాయాధికారి

అనంతపురం క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా బాగా చదవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం డ్రగ్స్, అబ్యూజింగ్ చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డ్రగ్ అబ్యూజింగ్ కింద నమోదయ్యే కేసులలో ఉన్న ఇబ్బందులు, అనంతరం తలెత్తే పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది హరికృష్ణ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, కళాశాల సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

30 మంది ఏఎస్ఐల బదిలీ

● 79మంది హెడ్‌కానిస్టేబుళ్లు కూడా..



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, డిసెంబరు 6: పట్టణాల్లో పనిచేసే పోలీసులను పల్లెలకు (మండల కేంద్రాల్లోని పోలీస్‌స్టేషన్లకు) మండలాల్లో పనిచేసే పోలీసులను పట్టణాలకు బదిలీ చేశారు. జిల్లాలో శుక్రవారం 30 మంది ఏఎస్ఐలు, 79 మంది హెడ్‌కానిస్టేబుళ్ల బదిలీలు జరిగాయి. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ జగదీష్ పోలీసుల బదిలీలకు ఓపెన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒకే చోట ఐదేళ్లు పని చేసిన ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. వీరిని ప్రస్తుతం పనిచేస్తున్న నియోజకవర్గంలో కాకుండా మరో నియోజకవర్గానికి బదిలీ చేశారు. పిల్లల స్కూల్ విషయంలో ఇబ్బంది అవుతుందన్న నెపంతో కానిస్టేబుళ్ల బదిలీలు జరగలేదని సమాచారం. కౌన్సెలింగ్‌లో ఏఎస్పీ రమణమూర్తి, పోలీస్ అధికారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

మూడేళ్లుగా ముప్పు..!




- శిథిలావస్థలో మద్దిలేరు వంతెన
- పట్టించుకోని గత వైసీపీ పాలకులు
- కూలితే 17 గ్రామాలకు బంద్‌కానున్న రాకపోకలు
- యోగివేమన జలాశయం నుంచి నీరు వదిలితే ప్రమాదమే

దెబ్బతిన్న మద్దిలేరు బ్రిడ్జి, వంతెనపై వెళ్తున్న భారీ వాహనం (ఇన్‌సెట్లో)

ముదిగుబ్బ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): యోగి వేమన జలాశయం నుంచి వదిలిన నీరు పార్నపల్లి డ్యాంకు చేరుతుంది. ఆ నీరు మద్దిలేరు వంతెనను దాటి వెళ్లాలి. ఈ వంతెన కొడవండ్లపల్లి, గంగిరెడ్డిపల్లికి మధ్యలో ఉంది. 2021 నివార్ తుఫాన్ సమయంలో ఐదు గేట్ల ద్వారా 32 వేల క్యూసెక్కులు నీటిని యోగి వేమన జలాశయం నుంచి దిగువకు వదిలారు. ఆ వరద దాటికి మద్దిలేరు వంతెన పూర్తిగా మునిగిపోయి... దెబ్బతింది. వైసీపీ నాయకులు తాత్కాలికంగా మట్టితో మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. అదే వంతెనపై వాహనాలు వెళ్తుండటంతో.. ఆ వంతెన రోజురోజుకూ దెబ్బతింటోంది. ఒక వేళ ఈ బ్రిడ్జి కూలితే 17 గ్రామాల ప్రజలకు రాకపోకలు పూర్తిగా బంద్ అవుతాయి. దీంతో ఈ వంతెన ఎప్పుడు కూలుతుందోనన్న ఆయా గ్రామాల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెనకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని గత వైసీపీ పాలకులను పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం యోగి వేమన రిజర్వాయర్ నీటితో తొనికిసలాడుతోందని, త్వరలో నీటిని విడుదల చేసే అవశముందని, అంతలోపే అధికారులు, కూటమి పాలకులు స్పందించి ఆ వంతెనకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

భయంగా ఉంది



మద్దిలేరు బ్రిడ్జిపై వెళ్లాలంటే భయంగా ఉంది. ఈ వంతెన నెర్రెలు చీలింది. వాహనదారులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని వెళ్తుంటారు. ఇప్పుడు యోగి వేమన జలాశయంలో నీరు చాలా ఉంది. ఆ నీటిని దిగువకు వదిలితే ఈ వంతెన కూలడం ఖాయం.

- నరేశ్, కొడవండ్లపల్లి

త్వరలో పనులు

మద్దిలేరు బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకున్న మాట వాస్తవమే. ఆ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిదులు మంజూరయ్యాయి. వర్షాలు తగ్గగానే ఆ వంతెన నిర్మాణ పనులు మొదలు పెడతాం.

-వన్నూర్‌స్వామి, ఆర్‌అండ్‌బీ ఏఈఈ

న్యూస్ బాక్స్..

నేటి రెవెన్యూ సదస్సు వాయిదా

నల్లచెరువు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతు భూసమస్యలపై శనివారం తమర్లవాండ్లపల్లిలో నిర్వహించాల్సిన రెవెన్యూ సదస్సును వాయిదా వేసినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లిలో సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నగేష్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుల సంఘం ఎన్నిక



ఎన్నికలు నిర్వహిస్తున్న అధికారి శంకరప్ప

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళమ్మచెరువు మత్స్యకార సంఘానికి శుక్రవారం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా చింతకాయల కేసప్ప, ఉపాధ్యక్షుడిగా గంగప్ప, ప్రధాన కార్యదర్శిగా గుర్రప్ప, ఆరుగురిని డైరక్టర్లుగా ఎన్నికయ్యారు.

భూమి కోసం దీక్ష



గాండ్లపెంటలో దీక్ష చేస్తున్న దళిత కుటుంబం

గాండ్లపెంట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని తనకు అప్పగించాలని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత కుటుంబం శుక్రవారం దీక్ష చేపట్టారు. మండలంలోని కటారుపల్లి గ్రామానికి చెందిన ఓబులేసు, వేమనారాయణ గతంలో గాండ్లపెంట పొలం సర్వే 1482లో రెండు ఎకరాల 41 సెంట్లు సాగుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఇటీవల సాగుచేయడానికి పొలంలో కంపచెట్లు తొలగిస్తుండగా, పెత్తందారులు, తహసీల్దార్ అడ్డుకున్నట్లు చెప్పారు. అందుకు నిరసనగా కుటుంబ సభ్యులతో దీక్ష చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా గతంలో తమకు ఇచ్చిన ప్రభుత్వ భూమిని అప్పగించాలని డిమాండ్ చేశారు.

విగ్రహ తయారీకి పూజ



పూజలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేశవనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి వారి విగ్రహాన్ని తయారు చేసే కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజలో అయ్యప్ప మాలధారులు భజనలు, పాటలు ఆలపించారు. ఇందులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరీశ్ బాబు, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు.

ఆలయ అభివృద్ధికి రూ.4లక్షలు విరాళం



అలంకరణలో స్వామి, అమ్మవార్లు

బత్తలపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం గ్రామంలోని రామాలయం అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన చిందులూరి బాబురావు రూ. 4 లక్షలను విరాళంగా అందజేశారు. ఆయన అమెరికాలో 40 ఏళ్ల క్రితం స్థిరపడ్డారు. ఆయన బంధు వులతో శుక్రవారం ఆలయంలో పున్యదాన కార్యక్రమం నిర్వహించి కలశ స్థాపన చేయించారు. అమెరికాలో ఉంటున్నా.. పుట్టిన ఊరును మరచిపోకుండా.. బాబురావు ఆలయ అభివృద్ధికి సాయం చేయడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ఓబుళదేవరచెరువు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డివారిపల్లి సమీపంలో ఉన్న ఎస్సీ బాలుర సమీకృత వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రైయింబో పాఠశాల కరస్పాండెంట్ జయసింహారెడ్డి స్టడీ మెంటీరియల్ అందించారు. శుక్రవారం రాత్రి వసతి గృహంలోని 14మంది విద్యార్థులకు వాటిని అందించారు. ఇందులో వార్డెన్ రవీంద్రనాథ్‌రెడ్డి, సిబ్బంది ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

అనంతపురంటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బళ్లారి బైపాస్‌లో గల ఆర్‌ఆర్ ఫిజియోథెరపీ కాలేజ్‌లో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చార్లెస్ డేనియల్, కరస్పాండెంట్ ఓబిలేసు శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. హైదరాబాదుకు చెందిన అనన్యా సీడీసీ ఆఫ్ ఫిజియోథెరపీ సంస్థ ఈ ఇంటర్వ్యూలు చేపడుతోందన్నారు. తొలిసారిగా జరుగుతున్నాయని అర్హత అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. క్యాంపస్‌నియామకాలకు వచ్చే అభ్యర్థులు ఒరిజనల్ సర్టిపికెట్స్‌తో రావాలని వారు తెలిపారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

శింగనమల డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులు బయోమెట్రిక్ హాజరు వేయాలని, లేని పక్షంలో శాఖపరమైన చర్యలు తప్పవని డీపీఓ నాగరాజునాయుడు హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశాడు. అనంతరం వర్మీకం పోస్టు షెడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మండలపరిషత్ కార్యాలయం ఏఓ నాగభూషణరెడ్డి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం అందజేత



చెక్కును అందజేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

కొత్తచెరువు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి నియోకజవర్గానికి చెందిన ఈడిగ రమణాకు రూ.5 లక్షలు, కొలిమి ముంతాజ్‌ఖాన్‌కు రూ.2.24 లక్షలు, శంకరప్ప రూ.1.53 లక్ష సీఎం రిలీఫ్ పండ్ కింద చెక్కులు మంజూరయ్యాయి. వాటిని స్థానిక మార్కెట్ యార్డ్‌లో బాధితులకు మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● అంబేడ్కర్‌కు నివాళి: అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక ధర్మవరం రహదారిలోని ఆయన విగ్రహానికి మంత్రి, ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని కోరారు.

అయ్యప్పస్వామి గ్రామోత్సవం



ముదిగుబ్బ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచగిరీష అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భక్తులు భజనలు, అయ్యప్పస్వామి నామసంకీర్తలు చేశారు. ఆలయం నుంచి పురవీధుల్లో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ఈ గ్రామోత్సవంలో అయ్యప్పస్వామి, శివ మాలధారులు పాల్గొన్నారు.

← గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

బీఆర్ అంబేడ్కర్‌కు నివాళి

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహానికి, చిత్రపటాలకు పలువురు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాకేంద్రలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరక్టర్ బేకరి గంగాధర్ పాల్గొన్నారు.

పుట్టపర్తిలో నివాళులర్పిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ డైరక్టర్ →





విద్యార్థులకు సూచనలిస్తున్న డీఎస్పీ

చట్టాలపై బాలికలకు అవగాహన

నల్లచెరువు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూరిబా పాఠశాలలోని బాలికలకు చట్టాలపై డీఎస్పీ శివనారాయణస్వామి శుక్రవారం రాత్రి అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మంచి-చెడు అలవాట్లు, ఫోక్సో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మహిళల అక్రమ రవాణా, బాల్యవాహాలు తదితర వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యలుంటే 100, 112, 181, 1098, 1930కు ఫోన్ చేయాలన్నారు. అనంతరం బీసీ హాస్టల్‌ను తనిఖీచేశారు. వారి భోజనాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ మగ్బుల్‌బాషా, ఎస్ఐ శిరీషా, బీసీ హాస్టల్ వార్డెన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కొండకమర్లలో పోలీస్ పల్లెనిద్ర

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకమర్లలో పోలీస్ పల్లె నిద్ర కార్యక్రమాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ నరేంద్రరెడ్డి గ్రామస్థులతో మాట్లాడుతూ.. గ్రామాల్లో గొడవలు మాని ప్రశాంత జీవనం గడపాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్ విశాఖపట్టణం బదిలీ అయ్యారు. దీంతో ఆయనకు శుక్రవారం స్థానిక డీపీఓలో ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఎస్పీ వీ రత్న మాట్లాడుతూ.. ప్రజలకు అందించిన సేవలతోనే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్ర మంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల్లశ్రీనివాసులు, ఎస్పీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఏఆర్ సీఐ శ్రీనివాసులు, ఏఆర్ ఆర్ఐలు వలి, మహేష్, ఆర్ఎస్సైలు వీరన్న, వెంకటేశ్వర్లు, ప్రదీప్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఏఆర్‌డీ ఎస్పీ విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎస్పీ రత్న

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

నల్లమాడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటీఎల్ వన్నూరుస్వామి మాట్లాడుతూ.. దివ్యాంగుల అభివృద్ధికి ఆర్డీటీ ఎంతగానో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ పీల్డు అధికారి విజయ్, ఆర్డిటి సీఓలు శ్రీనివాసులు, గంగులప్ప, ఇంతియాజ్, అమ్మభవాణీ మండల సమాఖ్య అధ్యక్షులు జయచంద్రారెడ్డి, వైస్ ప్రెసిండెంట్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు ప్రారంభం

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: రైతుల భూముల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సదస్సులకు శుక్రవారం నుంచి శ్రీకారం చుట్టింది. పుట్టపర్తి మండలంలోని కొట్లపల్లిలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సును ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రారంభించారు. కొట్లపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు రామక్క ఎమ్మెల్యేతో మాట్లాడుతూ.. తన కుమారుడు మూడు మాసాల క్రితం అతని భార్య సునీత హత్య చేశాడని, దీంతో అతను ప్రస్తుతం జైల్లో ఉన్నాడని తెలిపారు. వారి కుమార్తె ఐదేళ్ల పావని తన వద్దే ఉంటోందని, తనకూ వయసైపోయిందని, పాపను ఆదుకోవాలని కోరారు. చలించిన ఎమ్మెల్యే ఆ చిన్నారికి ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కాగా ఈ సదస్సులో మొత్తం 12 ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ అనుపమ తెలిపారు. బత్తలపల్లి మండలంలోని మాల్యవంతంలో రెవెన్యూ సదస్సును జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ నిర్వహిచారు. నంబులపూలకుంట మండలంలోని గౌనపల్లిలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ దేవేంద్రనాయక్ ఆధ్వర్యంలో, ముదిగుబ్బ మండలం గుజేపల్లి గ్రామంలో తహసీల్దార్ నారాయణస్వామి ఆధ్వర్యంలో, నల్లచెరువు సచివాలయం-2లో తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో, ధర్మవరం మండలం చిగిచెర్లలో తహసీల్దార్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో, అలాగే మండలంలోని దర్శినమల గ్రామంలో మంత్రి కార్యాలయ ఇన్‌చార్జ్ హరీష్ ఆధ్వర్యంలో, నల్ల మాడ మండలంలోని చారుపల్లి సచివాలయంలో తహసీల్దార్ రంగనాయకుల ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.



కొట్లపల్లిలో రామక్కతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

క్రైం న్యూస్ ....

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ధర్మవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డ్ సమీపంలో శుక్రవారం బైక్‌ను ఓ ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తాడిమర్రి మండలం నాయనపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్, చిన్నబంధు సాహెబ్ బైక్‌లో స్వగ్రామం నుంచి ధర్మవరానికి బయలుదేరారు. కదిరిగేటు వైపు నుంచి ఓ ట్రాక్టర్ బత్తలపల్లి వైపు బయలుదేరింది. మార్కెట్‌యార్డ్ సమీపంలోని చౌడేశ్వరిదేవాంగ కల్యాణ మండపం వద్ద టూటర్న్ తీసుకుంటున్న బైక్‌ను ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో ఆ ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చిన్నబంధు సాహెబ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెడపల్లి సమీపం చిత్రావతి వంతెన వద్ద ఓ వ్యక్తి అక్రమంగా నిల్వ ఉంచిన 40 టెట్రాప్యాకెట్లను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు, ఎస్ఐ ఉమామనోహర్‌రాజు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి.. అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం క్రీడాకారులు



క్రీడాకారులతో సంఘం సభ్యులు

ధర్మవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు సంజయ్, కిరణ్మయి, నీఖ్యశ్రీ ఎంపికయ్యారు. అనంతపు రంలో నవంబరు 24న ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో జరిగిన బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు తరఫున పాల్గొన్న వీరు ప్రతిభ చాటారు. దీంతో ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా మార్టురు పట్టణంలో నిర్వహించే 10వ సీనియర్స్ ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారు. ఈ క్రీడాకారులను ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా శుక్రవారం అభినందించారు.

టీటీ పోటీల్లో ప్రతిభ




హర్షవర్ధన్, జనార్ధన్

కదిరి అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంతర్ విశ్వవిద్యాలయాల టెబుల్ టెన్నీస్ పోటీలకు స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు హర్షవ ర్ధన్, జనార్ధన్ ఎంపికైనట్లు ఆ కళాశాల పీడీ నరసింహచారి శుక్రవారం తెలిపారు. గతనెల 29న అనంతపురం ఏస్కే యూనివర్సిటీలో జరిగిన అంతర్ కళాశాలల టెబుల్ టెన్నీస్ పోటీల్లో వీరు ప్రతిభచాటారన్నారు. ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత అభినందించారు.

తడిసిన వేరుశనగ

ధర్మవరం రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో తొలగించి తోటల్లో ఉంచిన వేరుశనగ పంట రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి తడిసిపోయింది. దీంతో కాయలతో పాటు పశువుల మేత కూడా పనికిరాకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన రైతు రాకెట్ల వెంకటేష్ మాట్లాడుతూ.. తాను రెండు ఎకరాల్లో వేరుశనగను బోరుబావి కింద సాగు చేశానన్నారు. సుమారు రూ.లక్ష వరకు ఖర్చు వచ్చిందన్నారు. పంట నీటితడుపులు, రసాయనిక మందులు ఖర్చు, కూలీల ఖర్చులు భారీగా వచ్చాయన్నారు. పంట నాలుగు నెలలు పూర్తికాగానే పంట దిగుబడి బాగా రావడంతో తొలగించానన్నారు. తొలగించిన రాత్రి వర్షం కురవడంతో పంటంతా తోటలోనే తడిసిపోయింది. దీంతో పంట మొత్తం పూర్తిగా దెబ్బతిందని వాపోయాడు. పంట బాగా వచ్చినా.. చేతికి అందకుండా పోయిందన్నారు.




వర్షానికి తడిసిపోయిన వేరుశనగ, తడిసిన పంటను చూపుతున్న రైతు వెంకటేష్ (ఇన్‌సెట్లో)

సంక్షిప్తం

బీమాను సద్వినియోగం చేసుకోండి



పంటల బీమా గురించి రైతులకు వివరిస్తున్నఅధికారులు

గోరంట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసిన వరి, మామిడి, వేరుశనగ, టామోట పంటలకు ఈనెలాఖరులోపు పంటల బీమాకోసం ప్రీమియం చెల్లించి సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు. మండలంలోని తాటిమేకలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి సాగుచేసిన వేరుశనగ పొలాన్ని అధికారులు శుక్రవారం సందర్శించారు. జిల్లా అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్ దాస్ మాట్లాడుతూ పంట నష్టం జరిగినప్పుడు రైతుకు బీమా భద్రతనిస్తుందన్నారు. మామిడికి ఎకరాకు రూ.36వేలు, వేరుశనగకు రూ.32వేలు, వరికి రూ.42వేలు వంతున పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. మామిడి, వేరుశనగ రైతులు ఈనెల 15లోపు, వరి సాగుచేసిన రైతులు ఈనెల31లోపు ప్రీమియం మొత్తం చెల్లించి బీమా సద్వినియో గం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ మునిక్రిష్ణ, ఏఈఓ మల్లికార్జున, మేనేజర్ యల్లప్ప, సిరికల్చర్ అసిస్టెంట్ వేదవతి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

గోరంట్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి ప్రధాన రహదారి జీనవాండ్లపల్లి వద్ద శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో రామాంజి, శంకరప్ప అనే ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని కొత్త బోయనపల్లికి చెందిన రామాంజి కియా అనుబంధ పరిశ్రమలో విధుల్లో చేరడానికి అదే గ్రామానికి చెందిన రఘుతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. జీనవాండ్లపల్లి వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. జీనవాండ్లపల్లికి చెందిన శంకరప్ప బోరు బావి వద్దకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నారు. ఇద్దరిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు చేశారు. రామాంజిని మెరుగైన చికిత్స కోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శంకరప్ప స్వల్పంగా గాయపడగా, రఘు సురక్షితంగా బయటపడ్డాడు.

గుండెపోటుతో పర్యావరణవేత్త మృతి



గోరంట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన జాతీయ పర్యావరణ అవార్డు గ్రహీత, విశ్రాంత గణిత ఉపాధ్యాయుడు రెడ్డివారి శంకర్‌నారాయణ (65) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. ఉపాధ్యాయుడిగా జిల్లాలోని పలుచోట్ల పనిచేసి చెట్ల పెంపకానికి విశేషంగా కృషిచేశారు. జాతీయ అవార్డుతోపాటు అనేక అవార్డులు, ప్రసంసా పత్రాలు అందుకున్నారు. 2020 మార్చిలో రిటైర్డ్ అయిన తరువాతకూడా గ్రీన్ భారత్ పౌండేషన్ ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషిచేశారు. గురువారం కమ్మలవాండ్లపల్లి బెస్ట్ యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా సమావేశంలో సుదీర్ఘంగా మాట్లాడారు. శుక్రవారం ఉదయం ఛాతి నొప్పి రావడంతో గోరంట్ల నుంచి పుట్టపర్తి ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేసి, ఘనంగా నివాళులర్పించారు.

చేపల చెరువు వేలం

గోరంట్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం పంచాయతీకి చేపల చెరువు ద్వారాఈ యేడాది రూ.2.71 లక్షలు ఆదాయం లభిస్తోంది. గ్రామ సచివాలయ వద్ద శుక్రవారం సర్పంచ్ గంగప్ప, ఈఓఆర్‌డీ శివన్న ఆధ్వర్యంలో కార్యదర్శి శంకర్ చేపల చెరువు వేలం నిర్వహించారు. పాలసముద్రం చెందిన ఆదిశేషు చేపల చెరువును రూ.2.71 లక్షలకు దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు.

అస్వస్థతతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

హిందూపురం అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం రొద్దం మండలం చిన్నకోడి పల్లికి చెందిన రామచంద్ర(46) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. ఆయన కుటుంబ సమేతంగా 8 ఏళ్ళ క్రితం చిన్నకోడిపల్లి నుంచి హిందూపురంలోని మేళాపురం దండురోడ్డులో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం హిందూపురం మండలం కిరికెర వద్ద ఇసుకను తీసుకురావడానికి వెళ్ళాడు. ఇసుక లోడ్ చేయించుకొని తిరిగి వస్తున్న సమయంలో అస్వస్థతకు గురై అక్కడే చెట్టు వద్ద కూర్చుండి పోయాడు. అక్కడ ఉన్న వారు ట్రాక్టర్ ఓనర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన స్పందించి మృతుడి బంధువులకు తెలియజేశాడు. 108కు ఫోన్ చేసినా స్పందనలేకపోవడంతో ప్రైవేట్ అంబులెన్స్‌లో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

మడకశిర రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ అనంతపురం ఆర్డీటీ రీజనల్ కార్యాలయంలో శుక్రవారం అంత ర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆర్డీటీ సెక్టార్ అధికారిఅనసూయమ్మ మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగుల సంఘాలు ఐక్యతతో పనిచేసి అన్నీ సాధించుకోవాన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాలలోని దివ్యాంగులు పాల్గొన్నారు.

స్టార్టర్, పైపులు ధ్వంసం

పరిగి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వంగలపల్లి గ్రామానికి చెందిన రైతు బాలకృష్టారెడ్డి, యోగానందరెడ్డి పొలంలో అమర్చిన స్టార్టర్, పైపులను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి ధ్వంసం చేశారు. వీరు కుటుంబ సమేతంగా బెంగళూరుకు ఓ శుభకార్యం నిమిత్తం వెళ్లగా ఈ సంఘటన చోటుచేసుకుందన్నారు. ఈ విషయంపై బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



పొలంలో ధ్వంసమైన స్టార్టర్, పైపులు

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

కలెక్టర్ టీఎస్ చేతన్



గోళ్లాపురంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, ఛత్రం గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

(న్యూస్ నెట్‌వర్క్ - ఆంధ్రజ్యోతి)

దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోవడానికి రెవెన్యూ సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురం మండలం గోళ్లాపురంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మీ భూమి-మీ హక్కు' రెవెన్యూ సదస్సులో రైతులకు తమ భూములపై ఉన్న సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. భూ సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు. వీఆర్‌ఓ దృష్టికి వచ్చిన సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించి భూముల వివరాలు, రికార్డులో పొందుపరచాలన్నారు. ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని, సమస్య పరిష్కారం అయిందా లేదా అనేది మీ సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుందన్నారు. రెవెన్యూ యంత్రాంగమంతా ప్రజలవద్దకే వస్తుందని, రికార్డులన్నీ అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సోనిసహాని, తహసీల్దార్ వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఆదినారాయణ, సర్పంచ్ దేవరాజ్, డీటీ మైనుద్దీన్, ఏఈ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే

భూ సమస్యలతో ఇబ్బంది పడుతున్న రైతులకు న్యాయం చేస్తామని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం మడకశిర మండలం ఛత్రం గ్రామంలో రెవెన్యూ సదస్సును ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడం కోసం జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులో ప్రజలు తమ సపమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. టీడీపీ రాష్ట ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ వైసీపీ పాలనలో భూముల రీ సర్వే తప్పుల తడకగా చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. అనంతనం ప్రజల నుంచి భూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కరుణాకర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సులో వైసీపీకి చెందిన ఎంపీటీసీ హనుమంతరాయప్ప పలు ఆసక్తిగల అంశాలను ప్రజల ముందు వెల్లడించారు. మాజీ రెవెన్యూశాఖ మంత్రి రఘువీరారెడ్డి సొంత కోల్డ్ స్టోరేజ్ భూములను వైసీసీ మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి కబ్జా చేశారని ఆరోపించారు. ఈ విషయం తానే స్వయంగా రఘువీరారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వైసీపీ పాలనలో భూకబ్జాలు అధికంగా జరిగినట్లు తెలిపారు.

సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ

రెవెన్యూ సదస్సులు నిర్వహించిన పలు గ్రామసభల్లో రైతులు, ప్రజలు తమ భూ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. గోరంట్ల మండలంలోని గంగంపల్లి సచివాలయం వద్ద రెవిన్యూ గ్రామసభ నిర్వహిస్తుండగా పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ తనిఖీ చేశారు. తహసీల్దార్ మారుతి గ్రామ సభ నిర్వహించగా, 8 మంది రైతులు సర్వే తదితర సమస్యలపై వినతిపత్రాలిం చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, డీపీఓ సుమతి, ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఎస్‌ఐ శ్రీనివాసులు, సర్వేయర్ తాతాయ్య పాల్గొన్నారు. పెనుకొండ మండలంలోని రాంపురం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 16 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు. గుడిబండ మండలం గుణేమోరుబాగల్ గ్రామంలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, ఆర్‌ఐ మహ్మద్‌బిలాల్, సర్వేయర్ ఫణికిషోర్ పాల్గొన్నారు. అమరాపురం మండల పరిధిలోని బసవనపల్లిలో సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 64 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతీప్రకాష్, ఎంపీడీఓ రామారావు, స్పెషల్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఆర్‌ఐ విన్సెంట్‌పాల్, సర్పంచు భాగ్యమ్మ పాల్గొన్నారు. లేపాక్షి మండలం మైదుగోళంలో నిర్వహించిన సదస్సులో 8 వినతులు వచ్చినట్లు డిప్యూటి తహసీల్దార్ కుమార్‌రెడ్డి తెలిపారు. చిలమత్తూరు మండలం శెట్టిపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పట్టాదార్ పాసుపుస్తకాలకు 35, భూసేకరణకు సంబంధించి 8, ఇంటి స్థలాలకు 3, సర్వే కోసం 4 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగారెడ్డి, అంజినప్ప, బాలాజీ, సోమశేఖర్ పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం : మంత్రి



భోజన శాలను ప్రారంభిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయమని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పట్టణానికి చెందిన విశ్రాంత పీఈటీ దివంగత సీసీ బాబయ్య, అంజినమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు, జూనియర్ లెక్చరర్ ఉమాశంకర్ రూ.8లక్షల సొంత నిధులతో మధ్యాహ్న భోజనానికి వంటగది, స్టోర్‌రూమ్, పిల్లలకు భోజనశాలను కట్టించారు. వీటిని శుక్రవారం మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ధనికులు ఎందరో ఉంటారని, సేవా గుణం కొందరిలోనే ఉంటుందన్నారు. దాతలు ముందుకొచ్చి ప్రభుత్వానికి సహకరిస్తే పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. ఉమాశంకర్ దంపతులను మంత్రి సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామక్రిష్టప్ప, ఎన్‌సీసీ ఆఫీసర్ వెంకటశ్రీనివాసులు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, నాయకులు జయరాములు, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, సూరి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దళిత జాతికి అండగా నిలిచిన రంగస్వామి



బెల్లదమడు రంగస్వామి జీవిత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

పావగడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంటరానితనాన్ని నిర్మూలించడంలో దళితజాతికి అండగా నిలిచిన దళిత సంఘర్ష సమితి వ్యవస్థాపకుడు బెల్లదమడు రంగస్వామి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు ఎల్.హనుమంతయ్య పేర్కొన్నారు. శుక్రవారం తుమకూరు జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కర్మయోగి బెల్లదమడు రంగస్వామి జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాహిత్యానికి పురోగతిని అందించి, జాతి పద్ధతిని, జీత పద్ధతిని నిర్మూలించడంలో రంగస్వామి పాత్ర ఎంతో అమోఘమైనదని ఆయన తెలిపారు. రాజకీయంగా దళితులు ఎదగాలన్న ఆయన రచనలు ఎంతో ప్రాముఖ్యమైనవని వివరించారు. ప్రామాణికత, క్రమశిక్షణకు బెల్లదమడు రంగస్వామి పెట్టినపేరు అని, నేడు ఆయన పుస్తక ఆవిష్కరణ చేస్తుండటం ప్రతి ఒక్కరి గుండెల్లోనూ ఆయన బతికే ఉన్నారని ప్రముఖ సాహిత్యవేత్త బరగూరు రామచంద్రప్ప తెలియజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కాళేగౌడ, దళిత నాయకులు దొరైరాజు, కృష్ణప్ప, గంగమ్మ, డాక్టర్ మురళీధర్, కేబుల్ రఘు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీ



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముగ్గులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

అగళి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : అగళి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ మీటింగ్‌లో భాగంగా విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహిచారు. ప్రధానోపాధ్యాయుడు వరదరాజుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ముగ్గుల పోటీలలో గెలుపొందిన తల్లులకు బహుమతులను శనివారం నిర్వహించే మెగా పేరెంట్స్ మీటింగ్‌లో అందజేయడం జరుగుతుందన్నారు. ఈ తల్లిదండ్రులు మీటింగ్‌కు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థుల తల్లులు అందరూ హాజరు కావాలన్నారు. అనంతరం ఎంఈఓ-2, ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజును, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలను రావాలని ఆహ్వానించారు.

అసమానతలు లేని సమాజమే అంబేడ్కర్ ఆశయం



అంబేడ్కర్ విగ్రహానికి పెనుకొండలో మంత్రి సవిత, మడకశిరలో ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి, సోమందేపల్లిలో ఉష శ్రీచరణ్ నివాళులు..

(న్యూస్ నెట్‌వర్క్ - ఆంధ్రజ్యోతి)

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మన దేశంలో పుట్టడం మనకు ఎంతో గర్వకారణమని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పెనుకొండ పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సిద్దయ్య, చిన్నవెంకటరాముడు, కేశవయ్య, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, షౌకత్, క్రిష్ణమూర్తి, సోమశేఖర్ పాల్గొన్నారు. అసమానతలు లేని సమాజం కోసం అనునిత్యం పరితపించిన మహానేత భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. మడకశిరలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ కారణ జన్ముడని, దళిత బహుజన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నాయకులు పాల్గొన్నారు. మడకశిరలోని ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాలలో అసోషియేట్ డీన్ డాక్టర్ సరోజనీదేవి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళుర్పించారు. చిలమత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు. రొళ్లలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, నారాయణ, రంగస్వామి, రమేష్, నాగరాజు పాల్గొన్నారు. అగళిలో జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్ పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు డీలర్ చిగునాగప్ప, మల్లికార్జున, భూతరాజు, జయన్న, నాగరాజు పాల్గొన్నారు. సోమందేపల్లిలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రమాకాంత్‌రెడ్డి, కన్వీనర్ గజేంద్ర పాల్గొన్నారు. దండోర నాయకుల ఆధ్వర్యంలో పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, నరసింహులు, కిష్టప్ప పాల్గొన్నారు. పావగడ పట్టణంలో అధికారులు, దళిత నాయకుల సమక్షంలో ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు సుబ్బరాజు, నారాయణప్ప, నాగరాజు, ఈరన్న, రామాంజి, కృష్ణ, మంజు, తహసీల్దార్ వరదరాజులు పాల్గొన్నారు. పెనుకొండలో అంబేడ్కర్‌కు నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజి, మూర్తి, రామక్రిష్ణ, శంకర్, నారాయణ, కొల్లప్ప, పెద్దన్న, నాగేంద్ర, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. బహుజన చైతన్యవేదిక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామక్రిష్ణ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

చెత్తమీద పన్నువేసిన ఘనుడు జగన్

పెనుకొండ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా చెత్త మీద పన్నువేసి వసూలు చేసిన ఘనుడు జగన్మోహన్‌రెడ్డి అని, అదే పన్నును ప్రజలకు భారం కాకూడదని రద్దుచేసిన ప్రజానాయకుడు ముఖ్యమంత్రి చంద్రబా బునాయుడు అని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం కొండకు వెళ్లే దారిలో 2.5 ఎకరాల్లో ఉన్న డంపింగ్ యార్డ్‌లో స్వ చ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా జ్ఞానేశ్వర్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జీరో గ్రౌండ్‌గా త యారుచేసే యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మా ట్లాడుతూ పెనుకొండ పట్టణంలో సేకరించిన చెత్తను యార్డుకు తరలించాలన్నారు. కార్యక్రమంలో నగర పాలక కమిషనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కూటమిలో విభేదాలు సృష్టించలేరు : ఎమ్మెల్యే

మడకశిరటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు ఎన్ని కుట్రలు పన్నినా ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీల మధ్య విభేదాలు సృష్టించలేరని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ఆవరణంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎన్‌డీఏ కూటమి, ప్రభుత్వ పటిష్టతకు అహర్నిశలూ కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం అవిశ్రాంతంగా పనిచేస్తున్న వ్యక్తిని వయస్సు మీదపడిందని విమర్శలు చేయడం ఎంతవరకు సమంసజం అని విజయసాయి రెడ్డిని ప్రశ్నించారు.

సీసీ కెమెరాలతోనే చోరీలకు చెక్

మడకశిర పట్టణంలో తరచూ జరుగుతున్న చోరీలను అరికట్టాలంటే త్రినేత్రం కెమరాలతోనే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి పట్టణంలోని వర్తక, వాణిజ్య పోలీసులతో సమావేశాన్ని నిర్వహించారు. మడకశిర నియోజకవర్గంతోపాటు పట్టణంలో దొంగతనాలు అరికట్టేందుకు పటిష్ఠమైన సాంకేతికత కల్గిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

టీడీపీలోకి పెరుగుతున్న వలసలు

రొళ్ల మండలం ఎల్.వడ్రహట్టి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. వైసీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు రంగప్ప, పాండురంగప్ప, ఎల్లప్ప, భూతరాజు, రంగారెడ్డి, హనుమంతరాయప్పలతోపాటు మరో పది కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు.

ఇక నుంచి 'పురం'లోనే ప్రభుత్వ ఐటీఐ

హిందూపురం అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ప్రభుత్వ ఐటీఐ కళాశాల హిందూపురంలోనే విద్యార్థులకు అందుబాటులో కొనసాగుతుందని ప్రిన్సిపాల్ రాయపరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంతకు ముందు శాంతనగర్‌లో ఓ ప్రైవేట్ అద్దె భవనంలో కొనసాగేదని దానిని లేపాక్షి మండలం కంచి సముద్రం విజేడీ హైస్కూల్‌లోని బీసీ వెల్ఫేర్ హాస్టల్ భవనంలో ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులకు రాను పోను అసౌకర్యంగా ఉండేదని, పెనుకొండ,మడకశిర, గోరంట్ల ఇతర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు హిందూపురం వచ్చి తరువాత అక్కడ నుంచి లేపాక్షికి అక్కడి నుంచి కంచి సముద్రంకు రావాల్సి ఉండేదన్నారు. దీంతో విపరీత కాలయపన, బస్సు చార్జీలు, వ్యయప్రాయసలతో కూడుకునేదన్నారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు విషయం తెలియజేయడంతో ఆయన స్పందించి మునిసిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులుతో మాట్లాడి హిందూపురంలోని శ్రీకంఠపురం ఝాన్సీ లక్ష్మీబాయ్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించుటకు ఎన్ఓసీ ఇచ్చారన్నారు. హిందూపురానికి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పెనుకొండ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌పీ రమేష్‌యాదవ్ వైద్య సిబ్బందికి సూచించారు. ఏపీఎయిడ్స్ నియంత్రణ మండలి, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని మావటూరు గ్రామంలో గుట్టూరు పీహెచ్‌సీ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం కింద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో డీఆర్‌పీ రమేష్, సీహెచ్ఓ మహేశ్వరి "ాట్లాడుతూ హెచ్ఐవి ఎలా వస్తుంది, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భవతులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బీపీ, షుగర్, తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ సూపర్‌వైజర్ వెంకట్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆట పాటలతో విద్య నేర్పాలి

పెనుకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పిల్లలకు ఆట పాటల ద్వారా విద్య నేర్పితే సులభంగా అర్థమవుతుందని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ హైదరాబాద్ సంస్థ ప్రతినిధి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ శాంతలక్ష్మీ అధ్యక్షతన అంగనవాడీ టీచర్ల ప్రాజెక్ట్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రీస్కూల్ విద్యార్థులకు ఆట పాటల ద్వారా విద్య నేర్పేవిధానాన్ని వివరించారు. యుడబ్ల్యుహెచ్ ప్రతినిధి వెంకటరాముడు మాట్లాడుతూ పెరటి తోటల పెంపకం ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యర్రమ్మ, రొద్దం, పెనుకొండ, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి

పెనుకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ వర్గీకణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ పిలుపు మేరకు ఈనెల 10న విజయవాడలో నిర్వహిస్తున్న కృతజ్ఞత మహాసభకు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దిలేటి, జిల్లా అధ్యక్షుడు రామాంజినప్ప, నాయకులు నరసింహులు, విజయ్‌కుమార్ నారాయణ, తదితరులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసినివాళులు అర్పించారు. అనంతరం మాదిగల కృతజ్ఞత యాత్ర ముగింపు మహాసభలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు.

వాల్మీకి డైరెక్టర్‌కు సన్మానం



ఆనంద్‌ను సన్మానిస్తున్న వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు

హిందూపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్‌కుమార్‌ను వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు సత్కరించారు. వాల్మీకి భవన్‌లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ వాల్మీకులెప్పుడు తెలుగుదేశం పార్టీతోనే ఉంటారని ఈసారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాల్మీకులకు పెద్దపీట వేశారన్నారు. ఉమ్మడి జిల్లాలో ఒక ఎంపీతోపాటు రెండు ఎమ్మెల్యేలు ఇచ్చిన ఘనత చంద్రబాబుదన్నారు. వాల్మీకులను ఎస్టీజాబితాలో చేర్చేందుకు చంద్రబాబు కేంద్రానికి సిఫార్సు చేశారని భవిష్యత్తులో వాల్మీకులంతా టీడీపీవెంటే ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగులు, కులస్థులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడికి...

అమరాపురం : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మారుతీప్రసాద్‌ను మండల కన్వీనర్ గణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. టీడీపీ నాయకులు మారుతీప్రసాద్ జీవితకాలపు సభ్యత్వ నమోదుగా రూ. లక్ష చెల్లించడంతో ఆయనకు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు జయకుమార్, కృష్ణమూర్తి, దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.